ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | మంగళవారం | 08.09.2026 | సంపుటి : 2 | సంచిక : 67 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు పటేల్



# అసెంబ్లీ ముందు రచ్చరచ్చ

## సమావేశాల ప్రారంభానికి ముందు ఉద్రిక్తత

## హామీల అమలుపై బీఆర్ఎస్ నేతల నిరసన

- నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి నేతలు
- నినాదాలు, ప్లకార్డులతో మూకుమ్మడి నిరసన
- పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం, తోపులాట
- అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద హరీశ్‌రావును అరెస్ట్
- మరింతగా నెలకొన్న ఉద్రిక్త వాతావరణం
- పోలీసులతో వాగ్వాదంలో కేటీఆర్‌కు గాయాలు
- పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో కేటీఆర్ ఆగ్రహం
- తోపులాటలో గాయపడ్డ మహిళా ఎమ్మెల్యేలు
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు అసెంబ్లీ ముందు ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన, హామీల అమలుపై నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి రావడం అసలు ఘర్షణకు కారణం అయింది. నినాదాలు, ప్లకార్డులతో వచ్చిన బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

02





10

తెలంగాణలో 'సర్' గడువు

## మరోసారి పొడిగింపు

**అక్టోబర్ 7 వరకు పొడిగిస్తూ ఈసి నిర్ణయం**

**నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 : తెలంగా ణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవర ణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగిం చింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ మే- రకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా

-మిగతా 2 లో..



## ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు

**నిషేధిత భూములు 22ఏ జాబితాపై సభలో రగడ**

**ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో బీజేపీ నినాదాలు**

**22ఏ అంశంపై చర్చకు పూర్తిగా సిద్ధం : మంత్రి శ్రీధర్ బాబు**

**బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి : మంత్రి పొంగులేటి**

హైదరాబాద్, సెప్టెంబర్ 7 :తెలంగాణ అసెంబ్లీ సమా వేశాలు ప్రారంభమైన వెంటనే నిషేధిత భూములు 22ఏ జాబితా వ్యవహారంపై సభలో రగడ మొదలైంది. 22 నిషేధిత భూముల నిబంధన కింద ప్రైవేట్ భూముల నమోదుపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో నినాదాలు చేశారు. ఈ వివాదంపై తక్షణమే విచారణ కమిటీని వేయాలని బీజేపీ సభ్యులు ప్రభుత్వాన్ని పట్టుబట్టారు. ఈ ఆందోళనపై శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించారు. 22ఎ అం శంపై సభలో స్వల్పకాలిక చర్చ చేపట్టేం దుకు తమ ప్రభుత్వం సంపూర్ణ సిద్ధంగా ఉందన్నారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో

-మిగతా 2 లో..



## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

02

**పోలీసులకు హైకోర్టు ఆదేశం**

ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారు

రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ

## స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు

**కంటతడి పెట్టుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్**

మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాల్సిందే

02

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్



## తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

**బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా**

**కొడంగల్‌లో 81 వేల ఓట్లు గల్లంతు**

**పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర**

**దీనిపై లౌకిక శక్తులు ఏకం కావాలి**

**సర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు.




హైదరాబాద్, సెప్టెంబర్ 7 : తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని

-మిగతా 2 లో..



| నేటి చికెన్ ధరలు | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## భగ్గుమన్న చమురు ధరలు!!

**హర్మ్యూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్తత**

**భారీగా తగ్గిన నౌకల రాకపోకలు**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 : పశ్చిమాసి యాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమ న్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య నౌకలపై పరస్పర దాడులు జరగ డంతో ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ చమురు రవాణాలో కీలకమైన హర్మ్యూజ్ జలసంధి సమీపంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలతో సరఫరాకు దీర్ఘకా లిక అంతరాయం కలుగుతుందన్న భయాలు మార్కెట్లను కుదిపేస్తు న్నాయి. ఇరాన్ ఆయిల్ ట్యాంకర్లపై దాడులు చేసినట్లు

-మిగతా 2 లో..



## నా వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావు

**శాసనసభ ఘటనపై తాతా మధు వివరణ**

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం (సెప్టెంబర్ 07) చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వివరణ ఇచ్చారు. ఈ ఘటనకు సంబం ధించి తాను మాట్లాడిన మాటలను తనకు ఆపాదిస్తు న్నారని పేర్కొంటూ.. ఈ విషయంపై తన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక కీలక ప్రకటన చేశారు.



03

## దేశాన్ని ముందుకు నడిపిస్తున్నది మహిళలే

**భారత చరిత్రలో మహిళలది కీలక పాత్ర..**

**లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక వ్యాఖ్యలు**

భారతదేశ చరిత్ర, వారసత్వంలో మహిళలు ఎల్లప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా నిలుస్తూ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. వారి నాయకత్వ పటిమను మరింత బలోపేతం చేసేందుకు సరైన అవకా శాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

03



జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..




# అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

- పోలీసులకు హైకోర్టు ఆదేశం
- ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారు
- రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :** తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# అసెంబ్లీ ముందు రచ్చరచ్చ

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 :** అసెంబ్లీలోకి నల్ల టీషర్టులతో వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా హరీశ్‌రావు బ్లాక్ టీషర్ట్ విప్పి బనియన్‌తో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఇదే విధంగా టీషర్టులు విప్పి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద హరీశ్‌రావును అరెస్ట్ చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే నల్ల టీషర్ట్ ధరించి అసెంబ్లీకి రావడంపై పోలీసులు అభ్యంతరం చెప్పడాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాహుల్ గాంధీ టీషర్ట్ ధరించి పార్లమెంట్‌కు వెళ్తే తప్పు లేనప్పుడు.. తాము నల్ల టీషర్టులు వేసుకుని నిరసన తెలపడం ఎందుకు తప్పని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తమ నిరసనను అడ్డుకుంటోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఇక.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్.. పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోలీసులు డ్యూటీ చేయండి, కానీ అతి చేయకండి అంటూ వ్యాఖ్యలు చేశారు. 2 ఏళ్లలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని.. వార్నింగ్ ఇచ్చారు. పోలీసులతో వాగ్వాదంలో తనకు అయిన గాయాలను.. మీడియాకు కేటీఆర్ చూపించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. మరోవైపు.. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తమతో అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. తన చీర పట్టుకుని లాగేశారని.. బూటు కాళ్లతో తొక్కారని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల కూడా పోలీసులు తీరును మార్చుకోవాలని ఆమె మండిపడ్డారు. మరోవైపు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద అస్వస్థతకు గురై కిందపడిపోయారు. కొద్దిసేపు ఆయన స్పృహ కోల్పోయినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. దీంతో అక్కడ ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. ఆయన తన కాలికి అయిన గాయాన్ని కూడా మీడియాకు చూపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ఇచ్చిన హామీల అమలు తీరును ప్రశ్నించేందుకు నల్ల



దుస్తులతో అసెంబ్లీకి వచ్చినట్లు బీఆర్ఎస్ సభ్యులు తెలిపారు. ఇటీవల రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైన 22ఏ భూముల అంశాన్ని కూడా సభలో ప్రధానంగా ప్రస్తావించేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. మరోవైపు అసెంబ్లీ వద్దకు వచ్చిన బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారని హరీష్ రావు ఆరోపించారు. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి దారుణంగా ప్రవర్తించారని అన్నారు. మంత్రిగా సేవలు అందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని సైతం జుట్టు పట్టి లాగడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుందని ఎద్దేవా చేశారు. అక్కాచెల్లెమ్మలతో ఇంత దుర్మార్గంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు హరీష్ రావు తెలిపారు. మేం సభలో లేని సమయంలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా వివాదాస్పద 22 ఏ నిషేధిత భూముల అంశంపై చర్చ జరపడం సరికాదన్నారు. తాము చేసేది తప్పు కాదంటే, ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని భావిస్తే బీఆర్ఎస్ సభ్యులు సభకు వచ్చినప్పుడు చర్చ జరగపాలని హరీష్ రావు ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తామన్న భయంతో మేం లేని సమయం చూసి సభలో చర్చిస్తున్నారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే కనుక మేం సభకు వచ్చినప్పుడు కీలకమైన నిషేధిత భూముల అంశంపై చర్చ జరగాలని ప్రభుత్వానికి హరీష్ రావు సూచించారు. పోలీసుల తోపులాటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతికి, నుదిటికి గాయాలైనట్లు తెలుస్తోంది. మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీశ్ రెడ్డి కిందపడిపోయారు. తమను పోలీసులు అడ్డుకోవడంతో అసెంబ్లీ గేటు వద్ద హరీష్ రావు తన చొక్కా విప్పేశారు. నల్ల టీషర్టుతో లోపలికి అనుమతించకపోవడంతో హరీష్ రావు బనియన్‌తో నిరసన తెలుపగా, ఆయనతో పాటు వేముల ప్రశాంత్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి తెలంగాణ భవన్‌కు తరలించారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు తమపై అమానుషంగా ప్రవర్తించారని పార్టీ నేతలు ఆరోపించారు. మరోవైపు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు అత్యంత దుర్మార్గంగా ప్రవర్తించారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. అసెంబ్లీకి వెళ్తున్న సమయంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగడంతో ఆమె కన్నీళ్లు పెట్టుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అలాగే మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డిని జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న గౌరవం ఇదేనా అని పోలీసుల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా అసెంబ్లీ గేటు వద్ద పోలీసుల అక్రమ అరెస్టులు, దాడుల ఘటనలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నిర్ణయించింది.

# ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

ఈ అంశానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని, నిబంధనలకు అనుగుణంగా చర్చపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం సభను అడ్డుకోవడం సరికాదని, సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు సర్దిచెప్పినప్పటికీ బీజేపీ ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గకుండా పోడియం వద్ద కాసేపు నినాదాలు చేశారు. విచారణకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటన చేసేవరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేయడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో తెలంగాణ అసెంబ్లీ 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఆ తరువాత సభ ప్రారంభం కాగా, బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని బయట వాళ్లు, లోపల వీళ్లు ఆందోళనకు దిగుతున్నారంటూ కాంగ్రెస్ సభ్యులు వ్యాఖ్యానించారు. సభలో ప్రజా సమస్యల పరిష్కారానికి, అర్థవంతమైన చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై సభా సమయాన్ని వృధా చేస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎస్సీల అభివృద్ధితో పాటు ఫీజు రీయింబర్స్మెంట్, క్రీడల అభివృద్ధి వంటి కీలక అంశాలపై ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నా... వాటిని వదిలేసి బురదజల్లే రాజకీయం చేయడం ప్రతిపక్షాలకు తగదని సూచించారు.రాష్ట్రంలో కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లక్ష కోట్ల కుంభకోణంపై విచారణ కోరుతూ తెలంగాణ ప్రభుత్వం ఏడాది క్రితమే కేంద్రానికి లేఖ రాసినా... ఆ ఎంక్వయిరీని ఎందుకు తొక్కిపెడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యేల్ని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో విచారణను ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఎందుకు ఆపుతున్నారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ 22ఏపై స్వల్ప కాలిక చర్చ పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని, 22 ఏ అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీజేపీ సభ్యులు కూర్చోవాలన్న స్పీకర్?, సభ సజావుగా సాగేందుకు సహకరించాలని ఆ పార్టీ సభ్యులను కోరారు. బీఏసీలో నిర్ణయం తీసుకుని 22ఏపై చర్చిద్దామని తెలిపారు.బీఏసీ సమావేశంలో 22 ఏ అంశాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 22 ఏపై స్వల్ప కాలిక చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమని హామీ ఇచ్చారు. నియమ నిబంధనలకు అనుగణంగా బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని బీజేపీ ఎమ్మెల్యేలకు చెప్పారు. ప్రతిపక్షాలు చర్చకు సహకరించాలని కోరారు. మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్ సర్దిచెప్పినా బీజేపీ ఎమ్మెల్యేలు వినకుండా 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. రాజకీయాల కోసం సభను అడ్డుకోవడం సరైంది కాదని శ్రీధర్ బాబు విమర్శించారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలను కోరారు. అయితే శ్రీధర్ బాబు విజ్ఞప్తిని బీజేపీ సభ్యులు పట్టించుకోలేదు. పదేపదే ఆయన కోరినా 22ఏ పై తక్షణమే చర్చ జరిగాలని పట్టుపట్టారు. దీంతో సభలో గందరగోళం చెలరేగింది. ఓ దశలో స్పీకర్ సభను వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తరువాత కూడా బీజేపీ సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. వచ్చే బోనాల పండుగ నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేస్తామని శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు నియోజకవర్గాన్ని యూనిట్?గా తీసుకున్నట్లుగా వివరించారు. లబ్ధిదారులకు మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే సిమెంట్ ఇప్పిస్తామని చెప్పారు.పేదలు నివసించే ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇళ్లను కట్టించి ఇస్తామని పొంగులేటి వెల్లడించారు. 2023 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్? ప్రభుత్వం హడావిడిగా కొంతమందికి పట్టాలిచ్చిందన్నారు. వారు ఇచ్చిన ఇళ్లలో చాలా మంది నివసించట్లేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పేదలు నివసించే ప్రాంతానికి 30-40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు ఇచ్చారని, డబుల్? బెడ్?రూమ్? ఇళ్లలో నివసించే వారిని అంటరాని వారిగా చూసేవారని ఆయన తెలిపారు.

# తెలంగాణలో 'సర్' గడువు మరోసారి పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.



# ఇది శాసనసభ కాదు.. కౌరవసభ

- సీఎం రేవంత్ సారీ చెప్పాలి
- రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్
- టీషర్టులతో మీరు పార్లమెంట్?కు వెళ్తారు
- మేము టీషర్టులతో అసెంబ్లీకి రాకూడదా?
- మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్,సెప్టెంబర్7 :** తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన హరీశ్‌రావు, ప్రస్తుత శాసనసభ ప్రజాస్వామ్యబద్ధంగా నడవడం లేదని, అది కౌరవ సభను తలపిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ చరిత్రలోనే ఈరోజు అత్యంత నల్లని రోజుగా మిగిలిపోతుందని, ప్రజా సమస్యలను లేవనెత్తుతున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులను దుర్మార్గంగా ప్రయోగిస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నినాదాలతో కూడిన టీషర్టులతో రావొద్దని బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల అభ్యంతరంతో మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టీ షర్టులు విప్పేశారు. బలియన్లపై ఉన్న హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద కేటీఆర్, హరీశ్‌రావును పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. పోలీసుల తీరుపై సునీతా లక్ష్మారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. పోలీసులు తన పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారని ఆమె కంటతడి పెట్టుకున్నారు. పోలీసుల వైఖరిని కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు తప్పుపట్టారు. ఈ సందర్భంగా హరీశ్?రావు మాట్లాడారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ టీషర్టులు వేసుకుని పార్లమెంట్‌కు వెళ్లారని, తాము అలా అసెంబ్లీకి రాకూడదా అని ప్రశ్నించారు. నల్ల టీషర్టుపై హామీలు అమలు చేయాలని మాత్రమే ఉందని తెలిపారు. నిరసన తెలిపే హక్కు తమకు ఉందన్న ఆయన, తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీకి రాకూడదనే ఇలాంటివి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీకి వస్తే ప్రశ్నిస్తారనే అడ్డుకుంటున్నారని, ప్రధాన ప్రతిపక్షం లేకుండానే చర్చ జరపాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉండగా, బీఆర్?ఎస్? నేతల ఆరోపణలపై ఖైరతాబాద్? డీసీపీ శిల్పవల్లి స్పందించారు. నల్ల టీషర్టులతో అసెంబ్లీకి రావడం నేరం కాదని పేర్కొన్నారు. నల్ల టీషర్టులపై అభ్యంతరకర పదాలున్నాయని తెలిపారు. టీషర్టలపై ఉన్న పదాల కారణంగానే అసెంబ్లీ లోపలికి అనుమతించలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పోలీసులు అసభ్యంగా ప్రవర్తించలేదన్న డీసీపీ, పోలీసుల తీరుపై బీఆర్ఎస్ ఆరోపణలను పరిశీలిస్తామన్నారు. స్పీకర్ సూచనల మేరకే పోలీసులు వ్యవహరించారన్న శిల్పవల్లి, అసెంబ్లీ గేటు దగ్గర జరిగిన ఘటన వీడియోలను పరిశీలిస్తామన్నారు. ఆందోళన సందర్భంగా పోలీసులు ప్రవర్తించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన హరీశ్‌రావు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అత్యంత హేయంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీర లాగడం, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కడం వంటి ఘటనలు అత్యంత అమానుషమని ధ్వజమెత్తారు. మహిళా సభ్యుల పట్ల దుర్మార్గంగా వ్యవహరించిన అధికారులను సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టేది లేదని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. తోపులాటలో జగదీష్ రెడ్డిని కింద పడేసి తొక్కేందుకు యత్నించారని, కేటీఆర్, సంజయ్, యాదవరెడ్డి, రాజశేఖర రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు.ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు వైఫల్యాలు, పింఛన్లు, మూడేళ్లుగా నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్మెంట్, ఉపాధ్యా యులు, ఉద్యోగుల సమస్యల నుంచి తప్పించుకోవడానికే ఈ దాడులకు తెగబడ్డారని విమర్శించారు. ప్రభుత్వం వెయ్యి రోజుల విఫల పాలన వాస్తవాలు సభలో బట్టబయలవుతాయనే భయంతోనే తమపై పథకం ప్రకారం కుట్ర పన్ని సస్పెండ్ చేశారని ఆరోపించారు. సభలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ లేకుండా చేసి, బీజేపీ -- కాంగ్రెస్ కలిసి నామమాత్రపు చర్చలతో మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయం చేస్తున్నాయని హరీశ్‌రావు ఎండగట్టారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు.

# స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు

## కంటతడి పెట్టుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

**హైదరాబాద్,సెప్టెంబర్7 :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో రాజకీయ దుమారం నెలకొంది. మరోవైపు మంత్రి సీతక్క భావోద్వేగానికి గురికాగా, స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభాపతిపై అనుచిత భాషలో వ్యాఖ్యలు చేయడాన్ని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. స్పీకర్ పదవిని అవమానించడం ఒక్క వ్యక్తిని కించపరచడం కాదని అది మొత్తం శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు జరిగిన అవమానమన్నారు. ఇది తెలంగాణ చరిత్రలోనే చీకటి రోజుగా సీఎం అభివర్ణించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడితో తక్షణమే రాజీనామా చేయించాలని, అవసరమైతే అతని పార్టీ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాల్సిందిగా కోరారు. శాసనసభలో జరిగిన ఈ ఘటనపై సీఎం తీవ్ర భావోద్వేగంతో మాట్లాడారు. "స్పీకర్ స్థానం రాజ్యాంగబద్ధమైన అత్యున్నత స్థానం.. సీఎం నుంచి సాధారణ సభ్యుడి వరకు ప్రతి ఒక్కరూ ఆ పదవిని గౌరవించాల్సిందే..

స్పీకర్ మనసు గాయపడేలా, ఆయన కుటుంబాన్ని కించపరిచేలా మాట్లాడటం క్షమించరాని నేరం" అని వ్యాఖ్యానించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన సభాపతిని అవమానించిన అంశాన్ని తాను దళిత ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నానన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడితే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి మాట తప్పారని, మూడెకరాల భూమి హామీని అమలు చేయలేదని రేవంత్ విమర్శించారు. తొలి ప్రభుత్వంలోనే దళిత ఉపముఖ్యమంత్రిని బర్తరఫ్ చేశారని, నేరెళ్ల ఘటనలో దళితులపై దాడులు జరిగాయని ప్రస్తావించారు.ఇలాంటి ఘటనలు రాజకీయాలకు అతీతంగా ఖండించాలని రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వం సంయమనం పాటిస్తే బలహీనతగా భావించవద్దన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను బెదిరింపులతో ప్రభావితం చేయాలనుకుంటే సహించబోమని స్పష్టం చేశారు. సభలో చర్చ అనంతరమే నిర్ణయాలు తీసుకుంటామన్నారు.ఘటనపై కఠిన సభా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దుర్మార్గపు పోకడలను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. ఇలాంటివి కట్టడి చేయకపోతే సమాజం మనలను క్షమించరని, ఇలాంటి దుర్మార్గమైన తక్షణమే చర్యలు కట్టడి చేయాలన్నారు. ప్రతిపక్ష నేత ఫామ్ హౌస్‌లో ఉండి ప్రోత్సహిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇద్దరు మండలి సభ్యులు బూతులు మాట్లాడారన్నారు. తాతా మధు, నవీన్ మీద చర్యలు తీసుకోవాలని.. వీధుల్లో కొట్లాడినట్లు.. అసెంబ్లీ ముందు ప్రవర్తించారంటూ మండిపడ్డారు. అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారని.. కేసీఆర్ డైరెక్షన్‌లోనే ఈ వ్యవహారం జరిగిందని సీతక్క పేర్కొన్నారు. సభలో ప్రసంగిస్తూ మంత్రి సీతక్క భావోద్వేగానికి గురయ్యారు.. స్పీకర్ స్థానాన్ని అవమానించడం సరికాదన్నారు.

# కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు. తెలంగాణలో సర్? ప్రక్రియ మొదలవ్వకముందు ప్రధాన ప్రతిపక్షం మాట్లాడింది. కోటి ఓట్లు తొలగించిన తర్వాత సర్?కు వ్యతిరేకంగా వారు ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం ఆ అంశాన్ని లేవనెత్తడం లేదు. 2029లో జరగబోవు ఎన్నికల్లో నరేంద్రమోదీ ఓటమికి ఈ ఓట్లతోనే పునాది పడుతుంది. ఈ ఓట్లు తొలగిస్తే మోదీకి వెయ్యేనుగుల బలం చేకూరుతుంది. ఎన్నికలు ఎప్పుడో ఉన్నాయి అప్పుడు చూద్దామనుకోవద్దు. గెలుపోటములను నిర్ణయించేంది ఎస్?ఐఆర్ అని అన్నారు. వ్యవసాయం గురించి సాధికారంగా మాట్లాడగలిగిన వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భూమిలోని సారం నుంచి మొదలుపెట్టి నీరు, విత్తనం, పెట్టుబడి, పంట, గిట్టుబాటు ధర.. అన్ని అంశాలు కూలంకషంగా చెప్పేవారని గుర్తుచేశారు. వ్యవసాయం గురించి అవగాహన కోసం సారంపల్లి మల్లారెడ్డి రాసిన పుస్తకాలు చదివానని తెలిపారు. సారంపల్లి మల్లారెడ్డిని తక్కువసార్లే కలిసినప్పటికీ, ఆయన అంటే అపారమైన గౌరవం ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడ్డాయని చెప్పారు.దున్నేవాడికే భూమి అంటూ ఎన్నో రైతు సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడారని రేవంత్ రెడ్డి కొనియాడారు. కమ్యూనిస్టులు అంటే తనకు పరోక్షంగా చాలా అభిమానమని వివరించారు. అసైన్డ్?, పోడు పట్టాలు దక్కాయంటే పోరాటం కమ్యూనిస్టులది, పరిష్కారం కాంగ్రెస్?దని వివరించారు. వారి ఉద్యమాల ఫలితంగానే కాంగ్రెస్ అనేక చట్టాలు తెచ్చిందని గుర్తుచేశారు.

# భగ్గుమన్న చమురు ధరలు!!

(మొదటిపేజీ తరువాయి)

అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. దీనికి ప్రతిగా, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నేవీ కూడా అమెరికా నౌకలతో పాటు, అనధికారిక మార్గాల్లో ప్రయాణిస్తున్న ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. ఈ పరిణామాలను విశ్లేషకులు 'ప్రధాన ఘర్షణ'గా అభివర్ణిస్తున్నారు. ఈ ఘర్షణల ప్రభావం హర్మ్యూజ్ జలసంధిపై తీవ్రంగా పడింది. సాధారణంగా ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం ఈ మార్గం గుండానే జరుగుతుంది. ప్రస్తుతం ఇక్కడ నౌకల రాకపోకలు భారీగా పడిపోయాయి. గతంలో రోజుకు 100కు పైగా నౌకలు ప్రయాణించగా, ఇప్పుడు ఆ సంఖ్య కేవలం 10కి పరిమితమైంది. త్వరలో ఈ ప్రాంతంలో కొత్తగా 'రిస్ట్రిక్టెడ్ జోన్' ప్రకటించేందుకు ఇరాన్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో, అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 0.54 శాతం పెరిగి 96.80 డాలర్లకు చేరుకుంది. అమెరికా బెంచ్‌మార్క్ డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 0.72 శాతం పెరిగి 92.14 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. గత వారంలోనే ఈ ధరలు 8-10 శాతం వరకు పెరిగాయి. మరోవైపు, సెప్టెంబర్




6న సమావేశమైన ఒపెక్ ప్లస్ దేశాలు అక్టోబర్ ఉత్పత్తి విధానంలో ఎలాంటి మార్పులు చేయకూడదని నిర్ణయించాయి. హర్మ్యూజ్ జలసంధిలో సరఫరా అంతరాయాలు కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2026 చివరి వరకు ఎగుమతులు పరిమితంగానే ఉంటాయని, పూర్తిస్థాయి పునరుద్ధరణ 2027లోనే సాధ్యమవుతుందని కొన్ని సంస్థలు అంచనా వేశాయి. ఈ ఉద్రిక్తతలు ప్రపంచ ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. తదుపరి దాడులు, దౌత్యపరమైన చర్చలపైనే మార్కెట్ గమనం ఆధారపడి ఉంటుంది.

# త్రివిధ దళాల సామర్థ్యం మరింత బలోపేతం

**1.10 లక్షల కోట్లతో ఆయుధాలు కొనుగోళ్లు**

**అత్యాధునిక ఆరుద్ర రాడార్లుకు ప్రాముఖ్యత**

**కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 :** దేశ త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏకంగా 1.10 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ పలు కీలక ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో 98 శాతం దేశీయ రక్షణ రంగ సంస్థల నుంచే కొనుగోళ్లు చేయనున్నట్లు స్పష్టం చేసింది.సాయుధ దళాల ఆధునీకరణే లక్ష్యంగా ఈ ఏడాదిని 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణశాఖ త్రివిధ దళాల బలోపేతానికి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యానికి అవసరమైన ఆయుధ పరికరాల సేకరణకు పచ్చజెండా ఊపింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఏకంగా రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదముద్ర వేసింది. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యానికి అవసరమైన కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ రెక్కీ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలు కలుషితమైన ప్రాంతాలను గుర్తించి, పర్యవేక్షించడంతో పాటు మార్కింగ్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అత్యంత క్లిష్టమైన సరిహద్దు భూభాగాల్లో దళాల వేగవంతమైన కదలికలు, లాజిస్టిక్స్, ఆపరేషనల్ సపోర్ట్ కోసం హై మొబిలిటీ వెహికల్స్ కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రువులకు ముకుతాడు వేసేలా సవాలుతో కూడిన ప్రాంతాల్లో అత్యంత వేగంగా, సమర్థవంతంగా మందుపాతరలను అమర్చేందుకు సెల్ఫ్-ప్రొపెల్డ్ మెకానికల్ మైన్ లేయర్స్ కొనుగోలుకు సైతం ఆమోదముద్ర వేసింది. యుద్ధ సమయాల్లో క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాల్లో అత్యంత సంక్లిష్టమైన మిషన్లలో కీలకంగా వ్యవహరించే అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, సర్వత్ర బ్రిడ్జ్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. భారత నావికాదళం కోసం 'ఆరుద్ర' రాడార్లతో పాటు మెరైన్ గ్యాస్ టర్బైన్ల రూపకల్పన, అభివృద్ధి, కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. వివిధ నావల్ ఎయిర్ స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న ఎయిర్ రూట్ సర్వెలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లను ప్రవేశపెట్టనున్నారు. యుద్ధనౌకలకు ఇంధన సిస్టమ్‌గా పనిచేసే మెరైన్ గ్యాస్ టర్బైన్ల కొనుగోలుతో ఇంజిన్ల విషయంలో విదేశీ సంస్థలపైన ఆధారపడటం తగ్గుతుందని రక్షణ శాఖ స్పష్టం చేసింది.భారత వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్లు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల యుద్ధ సామర్థ్యాన్ని పెంచే పలు ప్రతిపాదనలకు సైతం డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రుదేశాల నిఘా రాడార్లను సమర్థంగా అడ్డుకునే 'గ్రౌండ్-బేస్డ్ మల్టీ-పర్పస్ జామర్ల కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణ వ్యవస్థల భద్రతను డిజిటలైజ్ చేస్తూ 'డిఫెన్స్ ఫోర్సెస్ సెక్యూర్ యాక్సెస్ కార్డ్' వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు డీఏసీ అంగీకారం తెలిపింది. దీని ద్వారా దళాల్లో ఇప్పటివరకు ఉన్న పాత పేపర్ గుర్తింపు కార్డులు, పాస్‌లు, పర్మిట్ల స్థానంలో పరస్పరం పనిచేసే అత్యాధునిక స్మార్ట్ కార్డులను అమలు చేయనున్నారు. ఈ కొనుగోళ్లలో 98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరించనున్నట్లు రక్షణ శాఖ స్పష్టం చేసింది. తద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత ఊతమిస్తుందని వెల్లడించింది.




## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం

**ప్రయాణికులతో వెళుతున్న వాహనం బోల్తా**

**12 మంది మృతి, పదుల సంఖ్యలో గాయాలు**

**బాఘ్‌పత్,సెప్టెంబర్7 :** ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బాఘ్‌పత్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ప్రయాణికులతో వెళుతున్న ఓ పికప్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. రాజస్థాన్ నుంచి 32 మంది ప్రయాణికులతో బదౌన్‌కు బయలుదేరిన పికప్ వాహనం,. సోమవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో ఖేక్రా పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాగానే ప్రమాదానికి గురైంది. వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేక్రా, బాఘ్‌పత్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారని, ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మేల్కొన్నలోపే వాహనం బోల్తా పడిందని క్షతగాత్రులు తెలిపారు. అయితే, వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని డ్రైవర్ పేర్కొంటున్నాడు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుల వివరాలను సేకరిస్తున్నామని, బాధితుల కుటుంబ సభ్యుల సమాచారం కోసం 9454417383 నంబర్‌లో సంప్రదించాలని బాఘ్‌పత్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## నా వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావు

**శాసనసభ ఘటనపై తాతా మధు వివరణ**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :** తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం (సెప్టెంబర్ 07) చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వివరణ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించి తాను మాట్లాడిన మాటలను తనకు ఆపాదిస్తున్నారని పేర్కొంటూ.. ఈ విషయంపై తన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఒక కీలక ప్రకటన చేశారు. శాసనసభలోకి వెళ్లే సమయంలో మహిళా శాసనసభ్యులతో పాటు తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో తోపులాట, ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని ఎమ్మెల్సీ తాతా మధు చెప్పారు. ఈ క్రమంలో తనపై కూడా దాడి జరిగిందని, తన షర్టు, ప్యాంటు లాగేశారని, గొంతు నొక్కేందుకు ప్రయత్నం చేసినట్లు అనిపించిందని పేర్కొన్నారు. కొంతమంది తనను దుర్భాషలాడినట్లు పేర్కొన్నారు. ఈ పరిణామాలతో తీవ్ర ఆవేదనకు గురై.. తనపై దాడి చేసింది ఎవరు? తన షర్టు లాగేందుకు ఎవరు ప్రయత్నించారు? అలా చేయమని ఎవరు ఆదేశించారు? అంటూ తాను ప్రశ్నించినట్లు తాతా మధు వివరించారు. అయితే ఈ వ్యాఖ్యలను స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవిగా భావించడం సరికాదని స్పష్టం చేశారు.స్పీకర్ వ్యవస్థ పట్ల, వ్యక్తిగతంగా స్పీకర్ పట్ల తనకు ఎంతో గౌరవం ఉందని తాతా మధు తెలిపారు. స్పీకర్‌ను ఉద్దేశించి తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఒకవేళ తన వ్యాఖ్యల్లో ఏదైనా స్పీకర్‌ను ఉద్దేశించినట్టు భావిస్తే.. ఆ మాటలను ఉపసంహరించుకుంటున్నానని, అందుకు విచారం వ్యక్తం చేస్తున్నానని పేర్కొన్నారు. శాసనసభలోకి వెళ్లే సమయంలో తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యంగా మహిళా శాసనసభ్యులతో పోలీసులు వ్యవహరించిన తీరుపై తాతా మధు ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా శాసనసభ్యులతో తోపులాట జరిగిందని, వారి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తమ సీనియర్ నాయకులను పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లారని ఆయన తెలిపారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులతో వ్యవహరించే విషయంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.శాసనసభ్యులపై జరిగినట్లు చెప్పిన పరిణామాలపై ప్రభుత్వం స్పందించాలని తాతా మధు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను మాట్లాడిన వ్యాఖ్యలపై ఏర్పడిన వివాదం కంటే.. శాసనసభలో చోటుచేసుకున్న అసలు పరిణామాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తాతా మధు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల పట్ల జరిగిన ఘటనలపై సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. శాసనసభలో చోటుచేసుకున్న పరిణామాలపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. తాతా మధు ఇచ్చిన తాజా వివరణ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

## యెమెన్‌లో మళ్లీ భగ్గుమన్న హింస

- ప్రభుత్వ దళాలు, హౌతీల మధ్య యుద్ధం
- నాలుగు రోజుల్లో 117 మంది దుర్మరణం

**న్యూఢిల్లీ,సెప్టెంబర్7 :** యెమెన్‌లో మళ్లీ హింస ప్రజ్వరిల్లింది. ప్రభుత్వ బలగాలకు, హౌతీ తిరుగుబాటుదారులకు మధ్య పశ్చిమ ప్రావిన్సులైన తాయిజ్, హోదైదాలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న భీకర ఘర్షణల్లో కనీసం 117 మంది మరణించారు. కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న యుద్ధ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కడంతో దేశంలో మళ్లీ పూర్తిస్థాయి యుద్ధం మొదలవుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వైద్య అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, గురువారం నుంచి మొదలైన ఈ పోరులో 54 మంది ప్రభుత్వ సైనికులు ప్రాణాలు కోల్పోగా, అనేకమంది గాయపడ్డారు. అదే సమయంలో, హోదైదా ప్రావిన్సులోని హౌతీ అధీనంలో ఉన్న ఆసుపత్రుల సమాచారం ప్రకారం, 63 మంది హౌతీ సభ్యులు మరణించారు. దీంతో ఇరుపక్షాల మృతుల సంఖ్య 117కు చేరినట్లు వైద్య వర్గాలు ధ్రువీకరించాయి. వ్యూహాత్మకమైన బాబ్ అల్-మందబ్ జలసంధి సమీపంలో హౌతీలు పెద్ద ఎత్తున దాడులకు దిగడంతో ఈ ఘర్షణలు మొదలయ్యాయి. గత 24 గంటల్లో హౌతీలు కొన్ని ప్రాంతాల్లో వేగంగా ముందుకు చొచ్చుకురావడంతో, ప్రభుత్వ దళాలు వారిపై ఎదురుదాడికి దిగాయి. శుక్రవారం యెమెన్ ప్రభుత్వ యుద్ధ విమానాలు హోదైదా, తాయిజ్ ప్రావిన్సుల్లోని హౌతీల స్థావరాలపై వైమానిక దాడులు జరిపి భూతల దళాలకు మద్దతుగా నిలిచాయి. ప్రభుత్వ సైనిక అధికారి ఒకరు తెలిపిన వివరాల ప్రకారం, హౌతీలు స్వాధీనం చేసుకున్న కొన్ని కీలక స్థానాలను ప్రభుత్వ దళాలు మెరుపు వేగంతో జరిపిన ప్రతిదాడిలో తిరిగి చేజిక్కించుకున్నాయి. ఇటీవలి సంవత్సరాలలో పశ్చిమ యెమెన్‌లో ఇంతటి తీవ్రస్థాయిలో భూతల పోరాటం జరగడం ఇదే మొదటిసారని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 2014 చివర్లో హౌతీలు రాజధాని సనాతో పాటు ఉత్తర యెమెన్‌లోని చాలా ప్రాంతాలను ఆక్రమించుకోవడంతో యెమెన్‌లో అంతర్యుద్ధం ప్రారంభమైంది. ఆ తర్వాత 2015లో, అంతర్జాతీయ గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే.

## పోలీస్ స్టేషన్‌లో యువకుడి హైడ్రామా

- పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని పరుగులు..!
- మెదక్ జిల్లా రామాయంపేటలో ఘటన

**హైదరాబాద్,సెప్టెంబర్1 :** మెదక్ జిల్లా రామాయంపేటలో తీవ్ర కలకలం రేపే ఘటన చోటుచేసుకుంది. ఓ యువకుడు పోలీస్ స్టేషన్‌లోనే పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గాప్రసాద్ అనే యువకుడు గత కొద్దిరోజులుగా ఓ యువతిని వేధిస్తున్నాడనే ఆరోపణలపై రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో పోలీసుల చర్యలపై భయాందోళనకు గురైన యువకుడు తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. పెట్రోల్‌తో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన దుర్గాప్రసాద్.. అక్కడే తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలను గమనించిన పోలీసులు వెంటనే అప్రమత్తమై యువకుడిని రక్షించే ప్రయత్నం చేశారు. అనంతరం తీవ్ర గాయాలతో అతడిని రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం దుర్గాప్రసాద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆస్పత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. యువకుడు పోలీస్ స్టేషన్‌లోకి పెట్రోల్‌తో ఎలా వచ్చాడు? ఘటనకు ముందు ఏం జరిగింది? కేసు నమోదు చేసిన తర్వాత అతడికి పోలీసుల నుంచి ఎలాంటి చర్యలు ఎదురయ్యాయి? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ఉద్యోగాల పేరుతో యూట్యూబర్ మోసం

**శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్ట్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :** ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు.

## తాతా మధును బర్తరఫ్ చేయాలి

**స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు**

**కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: ఏలేటి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్టుగా భావిస్తున్న వ్యాఖ్యలు శాసనసభ వేదికగా తీవ్ర దుమారాన్ని రాజేశాయి. సభలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... రాజ్యాంగ బద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌పై తాతా మధు వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఎమ్మెల్యేల తరఫున స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ తక్షణమే దీనిపై సభకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు కావాలని మాట్లాడారా లేక ఎవరైనా మాట్లాడించారా అని ప్రశ్నించిన ఏలేటి... ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించిన సదరు ఎమ్మెల్సీని పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని పట్టుబట్టారు. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సభలో తీవ్రస్థాయిలో మండిపడుతూ, కేసీఆర్ క్షమాపణలు చెప్పాల్సిందేనని, మధుపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌కు జరిగిన తీవ్ర పరాభవంపై మంత్రి సీతక్క అసెంబ్లీలోనే భావోద్వేగానికి గురై కంటతడి పెట్టగా... స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా తీవ్ర మనస్తాపంతో భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకోవడం సభను కుదిపివేసింది. మరోవైపు 22-ఏ నిషిద్ధ భూముల వివాదంపై ప్రభుత్వాన్ని మహేశ్వర్ రెడ్డి నిలదీశారు. 22-ఏ భూముల్లో జరిగిన అక్రమాలపై స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డే క్షమాపణలు చెప్పాలని, అధికారుల మీద నెపం నెట్టి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ భూకుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్ బాబు సభలోనే స్పష్టమైన హామీ ఇస్తే తమ నిరసనను విరమిస్తామని స్పష్టం చేశారు. దీనిపై ప్రభుత్వం నేరుగా సమాధానం చెప్పకుండా ఇతర అంశాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. 'ధరణి'పై నిజంగానే ఫోరెన్సిక్ ఆడిట్ జరిగిందా అని నిలదీసిన ఆయన... ఒకవేళ జరిగితే ఆ ఆడిట్ నివేదికలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## దేశాన్ని ముందుకు నడిపిస్తున్నది మహిళలే

- భారత చరిత్రలో మహిళలది కీలక పాత్ర..
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 :** భారతదేశ చరిత్ర, వారసత్వంలో మహిళలు ఎల్లప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా నిలుస్తూ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. వారి నాయకత్వ పటిమను మరింత బలోపేతం చేసేందుకు సరైన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నేడు ఫరీదాబాద్‌లో జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) ఆధ్వర్యంలో మహిళా శాసనసభ్యుల కోసం నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఓం బిర్లా మాట్లాడుతూ.. "భారతదేశ చరిత్రలో మహిళలు ఎప్పు డూ మార్పునకు మార్గదర్శకులుగా ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు, రాజ్యాంగ రూపకల్పన నుంచి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడం వరకు వారి పాత్ర ఎంతో విశిష్టమైనది" అని కొనియాడారు. దేశం సంస్థాగత నిర్మాణం, ఆధ్యాత్మిక, మత, సాంస్కృతిక సంప్రదాయాలలో మహిళల సహకారం, గౌరవం, నాయకత్వం ఎన్నటికీ మరువలేనివని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో మహిళలు కేవలం మార్పునకు సంకేతంగా నిలవడమే కాకుండా, వివిధ రంగాలలో అపూర్వమైన విజయాలు సాధిస్తూ, తమ నాయకత్వ ప్రతిభను ప్రదర్శిస్తున్నారని ఓం బిర్లా అన్నారు. వారిలో ఉన్న సహజసిద్ధమైన నాయకత్వ లక్షణాలను గుర్తించి, వాటికి మరింత పదును పెట్టేందుకు తగిన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. "మహిళలకు సాధికారత కల్పించడం, వారి కోసం ఇలాంటి సామర్థ్య పెంపుదల వర్క్‌షాప్‌లు నిర్వహించడం రెండూ అత్యంత ముఖ్యమైన అంశాలు" అని ఆయన నొక్కిచెప్పారు. ఈ సందర్భంగా, మహిళా శాసనసభ్యుల కోసం ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రాహత్కర్‌ను ఓం బిర్లా ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు మహిళా నాయకులలో కొత్త స్ఫూర్తిని నింపుతాయని, ప్రజాసేవలో వారిని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వర్క్‌షాప్ ద్వారా మహిళా ప్రజాప్రతినిధులు కొత్త విషయాలు నేర్చుకుని, తమ తమ నియోజకవర్గాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు.

## సింగపూర్‌లో భారతీయులపై ద్వేషపూరిత వ్యాఖ్యలు

**విచారణకు ఆదేశించిన సింగపూర్ ప్రభుత్వం**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్7 :** సింగపూర్‌లో స్థానిక భారతీయులను, భారత సంతతి ప్రజలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో సాగుతున్న జాత్యహంకార, ద్వేషపూరిత వ్యాఖ్యలపై ఆ దేశ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల చైనా-నేపాల్ సరిహద్దుల్లో సంభవించిన ప్రకృతి వైపరీత్యంలో పలువురు సింగపూర్ పౌరులు గల్లంతైన ఘటనలతో పాటు, ఎయిర్ ఇండియాల్లో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టుబడుల వ్యవహారాన్ని ముడిపెడుతూ కొంతమంది ఆన్‌లైన్‌లో భారతీయులపై తీవ్ర స్థాయిలో ద్వేషాన్ని చిమ్ముడంపై సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్, సీనియర్ మంత్రులు కే. షణ్ముగం, లీ సీన్ లూంగ్‌లు తీవ్రంగా స్పందించారు. ఈ జాత్యహంకార వ్యాఖ్యలను "అత్యంత సిగ్గుచేటు, హేయం, ఎంతమాత్రం సహించరానివి"గా అభివర్ణించిన సీనియర్ మంత్రి కె.షణ్ముగం, వీటిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని పోలీసు యంత్రాం గాన్ని ఆదేశించారు. సమాజంలో మత, జాతిపరమైన సామరస్యానికి భంగం కలిగించే ఈ పోస్టులను వెంటనే తొలగించాలని డిజిటల్ అభివృద్ధి, సమాచార మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను కోరింది. ఏ ఒక్క వర్గంపైనా ద్వేషాన్ని సాధారణ అంశంగా మారనివ్వబోమని, తప్పు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సింగపూర్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

## ఉత్తర కొరియా అమ్ములపొదిలో 'కాంగ్ కోన్'

**విధ్వంసక నౌక నావికాదళంలోకి ప్రవేశం**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్7 :** ఉత్తర కొరియా తన నావికాదళాన్ని ఆధునీకరించే ప్రణాళికల్లో భాగంగా మరో కీలక ముందడుగు వేసింది. అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యంతో నిర్మించిన 'కాంగ్ కోన్' అనే కొత్త డిస్ట్రాయర్ (విధ్వంసక నౌక)ను నావికాదళంలోకి ప్రవేశపెట్టింది. దేశ తూర్పు తీరంలోని ఓడరేవు నగరం వోన్సాన్‌లో జరిగిన ఈ నౌక ప్రారంభోత్సవ కార్యక్రమానికి దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ స్వయంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. 5,000 టన్నుల బరువున్న ఈ కొత్త డిస్ట్రాయర్ కేవలం రక్షణ కోసమే కాదని, ఇది శత్రువులపై దాడి చేయగల సామర్థ్యం ఉన్న నౌక అని స్పష్టం చేశారు. "ఈ నౌక దేశ అణు ప్రతిచర్య వ్యవస్థలో ఒక భాగం. శత్రువుల నుంచి ముప్పు ఎదురైతే వారికి చావుదెబ్బ రుచిచూపించేలా ఇది ప్రతిదాడి చేస్తుంది" అని కిమ్ హెచ్చరించారు. దేశ నావికాదళాన్ని పూర్తిగా "అణు సాయుధ శక్తి"గా మార్చడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులా?

- మహిళా ఎమ్మెల్యేలు అని చూడకుండా దారుణం
- జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లారు: సబిత



**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :** అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై అభ్యంతరకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది కేవలం తమకు జరిగిన పరాభవం కాదని, మొత్తం తెలంగాణ మహిళా సమాజానికి జరిగిన తీవ్ర అవమానమని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ 1,000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి తరలివచ్చిన తమను పోలీసులు అమానుషంగా అడ్డుకున్నారని, మహిళా ఎమ్మెల్యేలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళుతూ, చీరలు లాగుతూ విచక్షణారహితంగా ప్రవర్తించారని ఆరోపించారు. "సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని పోలీసులు లాగుతుంటే, కేటీఆర్ సమయానికి వచ్చి అడ్డుకోకపోయి ఉంటే మమ్మల్ని అక్కడే పడేసి తొక్కేసేవారు.. కేటీఆర్ రావడంతోనే మేము ప్రాణాలతో బయటపడ్డాం" అని సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే గొంతు నొక్కడం, బట్టలు లాగడం, దాడికి దిగడం ఏ రకమైన ప్రజాపాలన అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం... నేడు ప్రజాప్రతినిధులైన మహిళలకే రక్షణ లేకుండా చేస్తోందని దుయ్యబట్టారు. హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తూ, అక్రమ అరెస్టులతో గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# జటిలమైన రాజకీయ భవిష్యత్తు!



**ఏదీ తెగేదాకా లాగొద్దనేది పెద్దల వాదన. సమస్యను చిన్నదిగా ఉన్నప్పుడే సామరస్యంగా పరిష్కరించుకుంటే అన్ని సర్దుకుంటాయి. కానీ తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం పెద్ద చర్చగా మారింది. మంత్రి పదవిలో ఉన్న సురేఖను సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ నుంచి తప్పించారు. గవర్నర్ కూడా దీనికి ఆమోదం తెలిపారు. ఆ తర్వాత కొండా సురేఖ శాఖలు సీఎం దగ్గరకు చేరాయి. విమర్శలు, వివరణలు, రిపోర్టుల తర్జనభర్జన తర్వాత.. కొండా సురేఖ ఎపిసోడ్‌కు ఎండ్ కార్డ్ పడింది.. దీంతో ఒక్కసారిగా కొండా కుటుంబం రాజకీయ భవిష్యత్తుపై చర్చ మొదలైంది. ఈ గొడవ ఒక్కరోజులో మొదలైంది కాదు.**

కొండా సురేఖ కూతురు సుష్మిత పటేల్ సీఎం రేవంత్‌రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేయడంతో అసలు గొడవ మొదలైంది. ముఖ్యంగా పరకాల సీటు విషయంలోనే కొండా కుటుంబానికి, రేవంత్‌రెడ్డి వర్గానికి మధ్య దూరం పెరిగిందనే చర్చ ఉంది. పరకాల సీటు విషయంలో సుష్మితకు ఆసక్తి ఉందనే వార్తలు వచ్చాయి. కానీ అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డినే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని రేవంత్‌రెడ్డి చెప్పడంతో సమస్య మరింత పెరిగింది. సురేఖ మాత్రం కూతురు చేసిన మాటలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని చెబుతున్నారు. కూతురు పెద్దదైందని, ఆమె మాటలకు తాను బాధ్యత వహించాల్సిన అవసరం లేదని ఆమె వాదిస్తున్నారు. కానీ కాంగ్రెస్ పెద్దలు మాత్రం పార్టీ విషయంలో క్రమశిక్షణ తప్పక పాటించాల్సిందే అన్న చందంగా వ్యవహరించారు. పరకాల పేరు ఈ గొడవలో పదేపదే వినిపించడం వెనుక రాజకీయ లెక్క ఉంది. కొండా కుటుంబానికి వరంగల్ ప్రాంతంలో చాలా ఏళ్లుగా రాజకీయ పరిచయాలు ఉన్నాయి. అదే సమయంలో రేవంత్‌రెడ్డి అక్కడ తనకు నమ్మకమైన నాయకులను ముందుకు తీసుకెళ్లాలని చూస్తున్నారు. ఇద్దరి దారులు వేర్వేరుగా కనిపించడంతో దూరం పెరిగిందనే మాట వినిపిస్తోంది. సురేఖ కూడా తనను ప్రభుత్వం పక్కన పెడుతోందని గతంలో కొన్ని సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారనే వార్తలు వచ్చాయి. అందుకే కూతురు చేసిన వ్యాఖ్యలు ఒక్కటే కారణం కాదని, ముందే కొంత దూరం పెరిగి ఉండొచ్చని రాజకీయంగా చర్చ జరుగుతోంది. అయితే ఇది రాజకీయ అంచనా మాత్రమే.

కొండా సురేఖ కూడా మౌనంగా ఉండలేదు. తనను కావాలనే పక్కన పెట్టారని, తనపై కుట్ర జరిగిందని ఆమె ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులపై కూడా ఆమె ఆరోపణలు చేశారు. అయితే ఇవన్నీ సురేఖ చేసిన ఆరోపణలే. వాటిని నిజమని నిర్ధారించే ఆధారాలు బయటకు రాలేదు. కాంగ్రెస్ మాత్రం పార్టీ నిర్ణయానికి కట్టుబడి ముందుకు వెళ్లింది. దీంతో మంత్రి పదవి పోయింది. ఇక్కడే అసలు రాజకీయం కనిపిస్తోంది. ఇది కేవలం ఒక మంత్రి పదవి పోయిన వ్యవహారం మాత్రమే కాదు. పార్టీలో ఎవరికి ఎంత బలం ఉంది, ఎవరితో ఎవరు కలిసి నడుస్తున్నారు, వచ్చే ఎన్నికల నాటికి ఎవరి మాట ఎంత వరకు చెల్లుతుంది అన్న లెక్కలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన ఆరోపణలు కూడా కలకలం రేపాయి. డబ్బుల పంపకానికి సంబంధించిన గొడవ వల్లే సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించారని ఆయన ఆరోపించారు. అవినీతి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని కూడా ఆయన అన్నారు. అయితే రాజాసింగ్ చెప్పింది ఆరోపణ మాత్రమే. దానికి ఇప్పటివరకు బలమైన ఆధారం బయటకు రాలేదు. సురేఖ కూడా తనపై అలాంటి ఆరోపణలు లేవని చెబుతున్నారు. కాబట్టి ఈ మాటలను రాజకీయ ఆరోపణలుగానే చూడాలి.

సురేఖను తప్పించిన తర్వాత ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన పదవుల్లో బీసీ మహిళలకు చోటు కల్పించింది. గద్వాల్ విజయలక్ష్మి, నేరెళ్ల శారద, జీ. సుధారాణిలకు కీలక బాధ్యతలు ఇచ్చారు. ఈ మార్పులను కొందరు రాజకీయంగా చూస్తున్నారు. బీసీ వర్గాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఏర్పడే ప్రభావాన్ని సర్దుబాటు చేసే ప్రయత్నంగా కొందరు భావిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఇదే కారణంతో ఈ నియామకాలు చేసిందని అధికారికంగా చెప్పలేదు.తెలంగాణలో మంత్రి పదవిలో ఉండగానే బయటకు వెళ్లాల్సి వచ్చిన సందర్భాలు గతంలోను ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో 2015లో తాటికొండ రాజయ్యను మంత్రి పదవి నుంచి తప్పించారు. ఆ తర్వాత 2021లో ఈటల రాజేందర్‌ను కూడా కేబినెట్ నుంచి తొలగించారు. ఈటలపై భూముల విషయంలో ఆరోపణలు రావడంతో ఆయన శాఖను తీసుకుని, ఆ తర్వాత కేబినెట్ నుంచి బయటకు పంపారు. ఈ ఆరోపణలను ఈటల ఖండించారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కూడా ఆయన అప్పట్లో చెప్పారు. ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం కూడా అదే వరుసలో మరో రాజకీయ ఘటనగా మారింది. అయితే మూడు ఘటనలకు మూడు వేర్వేరు కారణాలు ఉన్నాయి. అందుకే వాటిని ఒకే గాటన కట్టడం సరికాదు.

మంత్రి పదవి పోయిందంటే కొండా కుటుంబం రాజకీయంగా అయిపోయిందని చెప్పలేం. వరంగల్ ప్రాంతంలో కొండా కుటుంబానికి ఇంకా పరిచయాలు, అనుచరులు ఉన్నారు. సురేఖకు కూడా తనకంటూ రాజకీయ బలం ఉంది. అందుకే ఇప్పుడు అందరి చూపు కొండా కుటుంబం తర్వాత ఏం చేస్తుందనే దానిపైనే ఉంది. కాంగ్రెస్‌లోనే ఉండి ముందుకు వెళ్తారా, కొంతకాలం మౌనంగా ఉంటారా, లేక మరో దారి చూసుకుంటారా అన్నది కాలమే చెప్పాలి. మొత్తానికి కూతురు చేసిన వ్యాఖ్యలతో మొదలైన గొడవ, పరకాల సీటు దగ్గర పెరిగిన దూరం, పార్టీలో పెరిగిన గ్యాప్, చివరకు మంత్రి పదవి పోయే వరకు వెళ్లింది. కానీ ఇంతటితో కొండా సురేఖ రాజకీయ కథ ముగియలేదు. కుర్చీ పోయింది. ఇక కొండా కుటుంబం వేసే తర్వాతి అడుగే తెలంగాణ రాజకీయాల్లో అసలు ఆసక్తికరమైన అంశంగా మారనుంది. కానీ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నరు.

# మ్యాట్రీమోనీ పేరుతో భారీ మోసాలు

## ఫేక్ మ్యాట్రిమోనీతో డబ్బులు వసూలు




**పెళ్లి కుదరాలి.. పిల్లల జీవితం బాగుండాలి.. అనే తల్లిదండ్రుల ఆశ పడుతుంటారు. తమ స్థాయికి మించి కూడా మంచి సంబంధాల కోసం వెతుకుతుంటారు. బంధువులు తెలిసిన వారితో పాటు ఇటీవల కాలంలో మ్యాట్రీమోనీలను కూడా ఆశ్రయిస్తున్నారు. అయితే తల్లిదండ్రుల ఆశను ఆసరాగా చేసుకుని కొందరు సైబర్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే నల్గొండ జిల్లాలో వెలుగు చూసింది.**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :** మీ అమ్మాయికి పెళ్లి సంబంధం చూస్తున్నారా? పెళ్లి కుదిరిందానండీ.. మాది పలానా మ్యాట్రీమోనీ.. మీ అమ్మాయికి తగిన సంబంధాలు మావద్ద ఉన్నాయి. అబ్బాయి ప్రొఫైల్ పెట్టామంటారా.. అంటూ కేటుగాళు ఫోన్ లో అడుగుతారు. తల్లిదండ్రులు ఆసక్తి చూపగానే వెంటనే వాట్సాప్‌లో ఓ అందమైన అబ్బాయి ఫొటో.. దాంతోపాటు ఆకట్టుకునే ప్రొఫైల్ పంపిస్తారు. ఎన్ఆర్ఐ.. డాక్టర్.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. భారీ జీతం.. కోట్ల విలువైన ఆస్తులు అంటూ ప్రొఫైల్‌ను నమ్మేలా చేస్తారు. అబ్బాయి నచ్చాడని చెప్పగానే అసలు కథ మొదలవుతుంది. అబ్బాయి నచ్చాడని చెప్పగానే అసలు కథ మొదలవుతుంది. మీ పేరు రిజిస్టర్ చేయాలంటే రూ.5 వేలు పంపండి. అబ్బాయి తల్లిదండ్రుల ఫోన్ నంబర్ ఇస్తాం. మరికొన్ని మంచి ప్రొఫైల్స్ కూడా పంపిస్తాం అంటూ నమ్మిస్తారు. పెళ్లి సంబంధం కుదిరే ఆశతో తల్లిదండ్రులు డబ్బులు పంపిస్తారు. డబ్బులు అందిన కొద్దిసేపటికే అబ్బాయి తల్లిదండ్రుల పేరుతో ఓ ఫోన్ నంబర్ ఇస్తారు. కానీ ఆ నంబర్‌కు కాల్ చేస్తే.. "ఈ నంబర్ ప్రస్తుతం పనిచేయడం లేదు" అనే సమాధానం వస్తోంది. మ్యాట్రిమోనీకి ఫోన్ చేస్తే.. స్విచ్ఛాఫ్ వస్తుంది. వాట్సాప్‌లో పంపిన ప్రొఫైల్ లేదు.. ఫోన్ కాల్ చేసిన వ్యక్తి లేడు.. డబ్బులు మాత్రం తిరిగి రాక తల్లిదండ్రులు సైబర్ కేటుగాళ్ల చేతిలో మోసపోతున్నారు. వీటితోపాటు మరో తరహాలోనూ ఈ మోసాలు జరుగుతున్నాయి. ముందుగా పేరున్న మ్యాట్రిమోనీ సంస్థల్లో కొంత మొత్తాన్ని చెల్లించి.. అక్కడి ప్రొఫైల్స్‌ను పరిశీలిస్తారు. పక్కా వ్యూహంతో వారికి నచ్చిన ప్రొఫైల్స్ పట్టుకుని వేటకు బయలు దేరుతారు. ఎక్కువ కాలంగా సంబంధం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు.. వయసు దాటిపోతున్న యువతీ యువకులు.. రెండో పెళ్లి కోసం చూస్తున్నవారు.. ఇలా ప్రత్యేకంగా టార్గెట్ చేసుకుంటారు. ఆ తర్వాత తామే మ్యాట్రిమోనీ నిర్వాహకులమని పరిచయం చేసుకుని.. మీకు మంచి సంబంధం కుదురుస్తాం అంటూ రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అడ్వాన్స్ తీసుకుంటారు. డబ్బులు చేతికి వచ్చాక ఫోన్ ఎత్తరు. ఒకవేళ ఎత్తినా.. సంబంధం మాట్లాడుతున్నాం.. కొంత సమయం పడుతుంది అంటూ కాలయాపన చేస్తారు. చివరకు పూర్తిగా అందుబాటులో లేకుండా పోతారు. మ్యాట్రిమోనీ సంస్థల పేరుతో మోసగాళ్లు పక్కా వ్యూహంతో బాధితులను మోసం చేస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.5 వేలు.. రూ.10 వేలు మాత్రమే తీసుకుంటారు. బాధితులు కూడా "ఇంత చిన్న మొత్తానికి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. కానీ ఇలాంటి వాళ్లు పదుల సంఖ్యలో.. వందల సంఖ్యలో కుటుంబాలను టార్గెట్ చేస్తే.. అదే పెద్ద మొత్తంగా మారుతుంది. ఈ తరహా మ్యాట్రిమోనీ కాల్స్ ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. చిన్న మొత్తాల్లోనే మోసం చేస్తుండటంతో చాలామంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. అందుకే బయటకు కనిపించే కేసుల కంటే.. వాస్తవంగా మోసపోయిన వారి సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉందనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మోసాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు.మ్యాట్రిమోనీ పేరుతో ఫోన్ వస్తే వెంటనే నమ్మొద్దని పోలీసులు, సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

సంస్థ పూర్తి వివరాలు తెలుసుకోవాలనీ, కార్యాలయ చిరునామా, సంప్రదింపు వివరాలు పరిశీలించాలనీ సూచిస్తున్నారు గుర్తింపు లేని వ్యక్తిగత నంబర్లకు డబ్బులు పంపకూడదనీ, అబ్బాయి, కుటుంబ సభ్యుల వివరాలను స్వతంత్రంగా తెలుసుకోవాలని, ఫొటోలు, ఉద్యోగం, ఆస్తుల వివరాలను మాత్రమే నమ్మకూడదనీ సైబర్ నిపుణులు చెబుతున్నారు తొందరపెట్టి డబ్బులు అడిగితే అప్రమత్తం కావాలనీ, మోసం జరిగితే చెల్లింపు వివరాలు, ఫోన్ నంబర్లు, వాట్సాప్ చాట్స్, ప్రొఫైల్ ఫొటోలు భద్రపరచాలనీ సూచిస్తున్నారు.

# ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం, సరుకులు

**ఏపీ భవన్లో ప్రత్యేక రైస్ అవుట్‌లెట్ ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్**

**ఎన్‌సీసీఎఫ్ ద్వారా 64 రకాల నిత్యావసర సరుకులు విక్రయం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 :** దేశ రాజధాని న్యూఢిల్లీలో నివసిస్తున్న రాష్ట్ర ప్రజలకు తక్కువ ధరకే అత్యుత్తమ నాణ్యతతో కూడిన బియ్యం, నిత్యావసర సరుకులను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో, రెసిడెంట్ కమిషనర్ చొరవతో ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'రైస్ అవుట్‌లెట్'ను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మన రైతాంగం కష్టపడి పండించిన ధాన్యం రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా జాతీయ స్థాయిలోనూ అద్భుతమైన గుర్తింపు తెచ్చుకుం దని కొనియాడారు. ముఖ్యంగా ఢిల్లీ నగరంలో స్థిరపడిన, నివసి స్తున్న తెలుగు ప్రజలందరికీ స్వచ్ఛమైన, నాణ్యమైన మన ఊరి రుచులను, వరి వంగడాలను అందించాలనే ఉద్దేశంతోనే ఈ అవుట్‌లెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడిం చారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేఎన్ఎం, బీపీటీ వంటి వివిధ రకాల బియ్యం వెరైటీలతో పాటు, ఎన్‌సీసీఎఫ్ ద్వారా సేకరించిన 64 రకాల నాణ్యమైన సరుకులను కూడా సబ్సిడీ రేట్లతో ఈ కౌంటర్ ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందించే ఈ సేవల్లో ఎటువంటి లోపాలు తలెత్తకుండా అర్హత గల నిపుణులను నియమించి పారదర్శకంగా సేవలు అందిస్తామని మంత్రి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్, ప్రభుత్వ సలహాదారు ఏకే జైన్, ఏపీ భవన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిపై నాకు అభ్యంతరం లేదు

- మా పార్టీ సీఎం అభ్యర్థి నేను కాదు
- ఆ రెండు ముమ్మాటికీ ఫ్యాక్షన్ పార్టీలే..
- ప్రజలకు గోరంత, తమకు కొండంత
- విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు



**అమరావతి, సెప్టెంబర్ 7 :** "అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే" అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన ఆయన... భవిష్యత్ కార్యాచరణపై మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని.. ఏపీని రూ. 12 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకే తమ కొత్త పార్టీ ఉద్భవిస్తోందని స్పష్టం చేశారు. కేవలం రెడ్డి, కమ్మ సామాజిక వర్గాల వారే సీఎం స్థానంలో ఉండాలా? ఆయన ప్రశ్నించారు. బీసీలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని... తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఆయన మరొక సంచలన ప్రకటన చేశారు. తన పార్టీకి తాను సీఎం అభ్యర్థిని కాదని స్పష్టం చేశారు. బాల్ థాకరే తరహాలో కేవలం 'మెంటర్' గా మాత్రమే దిశానిర్దేశం చేస్తానని తేల్చిచెప్పారు. తన కుటుంబ సభ్యులు ఎవరూ కూడా పదవుల్లో ఉండరని స్పష్టం చేశారు. రాష్ట్రం విడిపోయినప్పుడు రూ. 1.02 లక్షల కోట్లుగా ఉన్న అప్పులు, గత 12 ఏళ్ల పాలనలో రూ. 12 లక్షల కోట్లకు ఎలా చేరాయని... ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి అద్దెలను అదుపులోకి తీసుకురావడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని వెల్లడించారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఏపీ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో తాను ఏర్పాటు చేయబోయే నూతన రాజకీయ పార్టీ జెండా, అజెండాను ప్రకటించే ముందు, రాష్ట్రంలోని సమస్యలను ప్రజల ముందు ఉంచుతానని స్పష్టం చేశారు. ఏపీకి ఇప్పుడు మూడో ప్రత్యామ్నాయం ఎంతో అవసరమని, ఈ విషయాన్ని ప్రజలకు వివరిస్తానని ఆయన తెలిపారు. విజయవాడలో సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని విజయసాయిరెడ్డి విమర్శించారు. ముఖ్యంగా రాష్ట్ర రాజకీయం మొత్తం రెండు పార్టీల చుట్టూనే తిరుగుతోందని, వైసీపీ, టీడీపీల మధ్య ఫ్యాక్షన్ తరహా యుద్ధం జరుగుతోందని ఆరోపించారు. ఈ పార్టీలకు పోలీసులు కూడా మద్దతు ఇస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. టీడీపీ, వైసీపీలు ఫ్యాక్షన్ కుటుంబ రాజకీయ పార్టీలని విజయసాయిరెడ్డి అభివర్ణించారు. ఆరు కోట్ల ప్రజానీకం, రాష్ట్ర సంపదను ఏ పార్టీ దోచుకోవాలనే హక్కు కోసం ఈ రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రజలకు గోరంత, తమకు కొండంత" అన్నట్లుగా ఈ పార్టీల తీరు ఉందని, అందుకే రాష్ట్రానికి మరో రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని ఆయన నొక్కి చెప్పారు.

# కుష్టు వ్యాధిని సమాజం నుండి తరిమేయ్యాలి

**ఇంటింటి సర్వే గోడపత్రికలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**

**ఏలూరు, సెప్టెంబరు 07 :** జిల్లాలో కుష్టు వ్యాధిని సమాజం నుండి తరిమేయ్యాలని, ప్రాథమిక దశలోనే గుర్తించి, అవసరమైన వైద్యసేవలు, వైద్యచికిత్సలు అందించేందుకు చేపడుతున్న ఇంటింటి సర్వేను జిల్లా ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సూచించారు. జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, కుష్టునివారణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుండి 29వ తేదీ వరకు 14 రోజులు పాటు ఇంటింటి కుష్టువ్యాధి నిర్మూలన సర్వేగోడ పత్రికలను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలోకుష్టువ్యాధి నిర్మూలన ఇంటింటి సర్వే ఇంటింటికీ వెళ్ళి నిర్వహించే సర్వేలో సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. చర్మంపై కనిపించే అనుమానాస్పద మచ్చలు, పొక్కులు,రంగు మార్పులు, స్పర్శతగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సర్వే సిబ్బందికి తెలియచెయ్యాలని సూచించారు. అనుమానిత కేసుల ను గుర్తించి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేక పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు, చికిత్సలు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబం ధిత అధికారులను ఆదేశించారు

# ఏలూరు మేయర్, జడ్పీ చైర్మన్ పదవులు బీసీలకే కేటాయించాలి

- స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- జిల్లా బీసీ సంక్షేమ సంఘం రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

**ఏలూరు, సెప్టెంబర్ 7 :** ఏలూరు నగర మేయర్, జిల్లా పరిషత్ చైర్మన్ పదవులను బీసీలకు కేటాయించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా శాఖ డిమాండ్ చేసింది.ఏలూరులోని లేడీస్ క్లబ్ మీటింగ్ హాల్‌లో జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు లక్కోజు రాజగోపాలా చారి (గోపి) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ బీసీ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ సమస్యలు, రాజకీయ ప్రాతినిధ్యంపై చర్చించారు. సమావేశంలో 50 శాతానికి పైగా జనాభా ఉన్న బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని రాజకీయ పార్టీలను డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు.



## అన్నమయ్యకాలనీ నూతన కమిటీ ఎన్నిక

**నూతన అధ్యక్షులు వోల్లాల శ్రీనివాస్ గౌడ్**

**నాగారం,సెప్టెంబర్ 7 (జనంవార్త) :** నాగారం డివిజన్ పరిధిలోని అన్నమయ్య కాలనీ నూతన కమిటీ సభ్యులను సోమవారం ఎన్నుకున్నారు.కాలనీ నూతన అధ్యక్షులుగా వోల్లాల శ్రీనివాస్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్,షాజీ నాయిర్, జనరల్ సెక్రెటరీ ప్రభాకర్, జాయింట్ సెక్రెటరీ రామ్మోహన్ రావు, ట్రెజరర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కిరణ్ కుమార్,ప్రకాష్ చారి,లక్ష్మణ్, శ్రీనివాస్,ముఖ్య సలహాదారులు రాంబాబుగౌడ్,కె కృష్ణారెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయక కాలనీ అభివృద్ధి కొరకు శక్తివంచన లేకున్న కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. అనంతరం కాలనీవాసులు నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతిపక్ష గొంతుకను అణచివేయడం సరికాదు

**ప్రజా ఆగ్రహాన్ని పోలీసులు, నిర్బంధాలతో ఆపలేరు: చిర్రా రవీందర్ యాదవ్**





**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 7(జనం వార్త):** శాసనసభకు నల్లచొక్కాలతో హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడం, వారిపై దాడికి పాల్పడటం అప్రజాస్వామికమని శేరిలింగంపల్లి ఉద్యమ నాయకుడు చిర్రా రవీందర్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. ప్రజా సమస్యలపై నిరసన తెలిపే ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కును ప్రభుత్వం అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని ఆయన అన్నారు. ప్రజా సమస్యలను శాసనసభ దృష్టికి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నల్లచొక్కాలతో నిరసన తెలిపితే వారిని పోలీసులు అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని రవీందర్ యాదవ్ ఆరోపించారు. పార్లమెంటుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నల్ల టీషర్ట్‌తో వెళ్లవచ్చని, అదే విధంగా రాష్ట్ర శాసనసభకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నల్ల దుస్తులతో వెళ్లకూడదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. హామీల అమలుపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి, ఆగ్రహాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్షానికి సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, పోలీసుల ద్వారా నిరసనలను అణచివేయడం సరికాదన్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత శోచనీయమని చిర్రా రవీందర్ యాదవ్ అన్నారు. ఆమె చీరను పోలీసులు లాగిన ఘటనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు గాయాలు కావడం, వారు కిందపడే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. పోలీసుల అత్యుత్సాహంపై సమగ్ర విచారణ జరిపించాలని, ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇది కేవలం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై జరిగిన ఘటనగా చూడకూడదని, ప్రజాస్వామ్య విలువలు, ప్రతిపక్షాల హక్కులు, స్వేచ్ఛగా నిరసన తెలిపే రాజ్యాంగబద్ధ హక్కులపై జరిగిన దాడిగా భావించాలని రవీందర్ యాదవ్ అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక న్యాయం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో న్యాయం అనే ధోరణిని కాంగ్రెస్ ప్రభుత్వం విడనాడాలని ఆయన హితవు పలికారు. నల్లచొక్కాలను పోలీసులు అడ్డుకోగలరేమో కానీ ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహాన్ని మాత్రం అడ్డుకోలేరని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు చేపట్టే నిరసనలను అణచివేయడం కాకుండా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు సమాధానం చెప్పాలని చిర్రా రవీందర్ యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## రాష్ట్ర ప్రభుత్వం దళితులు అంటే చిన్న చూపేనా?

**దుబ్బాక సెప్టెంబర్ 7 జనం వార్త :** అసెంబ్లీ సాక్షిగా ఈరోజు తెలంగాణ శాసనమండలి సభ్యుడు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ని దుర్భాషలాడం యావత్ తెలంగాణ సమాజం, దళిత సామాజిక వర్గం తలదించుకుంటోంది. మాజీ సీఎం కెసిఆర్ డైరెక్షన్ తోనే మాజీ మంత్రులు కేటీఆర్ హరీష్ రావులు కాంగ్రెస్ ప్రభుత్వంలోని దళిత ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ప్రభుత్వాన్ని అస్థిర పరచడానికి కుట్రలు చేస్తున్నారు. సభాపతిని గౌరవించని బీఆర్ఎస్ నాయకులకు ప్రతి పక్ష హోదా, నెల నెలా జీతాలెందుకు? గత బీఆర్ ఎస్ ప్రభుత్వంలో ఒక దళితుడైన భట్టి విక్రమార్క ప్రతి పక్ష హోదాలో ఉండకూడదని కేసీఆర్ కుట్ర చేసి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చీలిక తెచ్చింది కేసీఆర్ ప్రభుత్వం కాదా? ఇసుక మాఫియాతో భూ గర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, ఇసుక లారీలతో రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయని నేరేళ్ల గ్రామ దళితులు అడ్డుకుంటే వారిని సంసారానికి పనికి రాకుండా చేసింది కేసీఆర్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నిస్తున్నాను. తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి దళితుడే అని మాట మార్చింది కేసీఆర్. కారణం లేకుండా అప్పటి డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్యను డిస్మిస్ చేసింది కేసీఆర్ కాదా. ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు ఇస్తామని మోసం చేసింది. ఇలాంటి సంఘటనలు చూస్తుంటే దళితుల పట్ల బిఆర్ ఎస్ కు దళితుల పట్ల ప్రేమ లేదనిస్తోంది. ఈ రోజు సభ్య సమాజం తలదించుకునేలా ఎమ్మెల్సీ మధుసూదన్, నవీన్ రెడ్డిలు స్పీకర్, పోలీస్ యంత్రాంగాన్ని అమ్మన భూతులు తిట్టడంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వారి సభ్యత్వాలను రద్దు చేయాలి. దేవాలయం లాంటి అసెంబ్లీలోకి 420 రాసిన నల్ల దుస్తులు ధరించి సభను పక్క తోవ పట్టించాలని చూస్తున్నారు. దళితున్ని అవమానిస్తే అసెంబ్లీ సజావుగా సాగకుండా ఉంటుందని హరీష్ రావు కేటీఆర్ గారి పన్నాగంగా కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది యావత్ తెలంగాణ ప్రజలు మీరు చేసే చిల్లర చేష్టలు చూస్తూ ఉన్నారు సభాపతి గడ్డం ప్రసాద్ ని అవమానపరిచిన ఎమ్మెల్సీ తాత మధుసూదన్ పై రాజ నా అట్రాసిటీ కేసు నమోదు చేయాలి అలాగే శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేయడం జరుగుతుంది బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హరీష్ రావు యావత్ దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలి లేని ఎడల మిమ్ములను గ్రామాల్లో తిరగనివ్వం ఖబర్దార్ ఈ కార్యక్రమంలో దుబ్బాక పీఏసిఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, మున్సిపల్ అధ్యక్షులు మల్లుగారి చంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు తునికి సురేష్ శ్రీరామ్ నరేందర్ ఐరనీ సాయి, ఆత్మ కమిటీ డైరెక్టర్ ఆకుల భరత్, బాల్తే వెంకటేశము, కీసరి శీను, భూపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లో ఉంటేనే ప్రజా నాయకుడు!

- బీర్ల ఐలయ్యను చూసి మిగతా ఎమ్మెల్యేలు నేర్చుకోవాలి
- మార్నింగ్ వాక్ నుంచి ప్రజా సమస్యల పరిష్కారం వరకు.. ఆలేరు ఎమ్మెల్యేకు ప్రజలతో నిత్య అనుబంధం
- ప్రత్యేక రాజకీయ విశ్లేషణ

**ప్రజలు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించేది కేవలం అసెంబ్లీలో కూర్చోవడానికి కాదు.. తమ నియోజకవర్గంలో ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి. ప్రజలతో నిత్యం మమేకమై, వారి కష్టాలను స్వయంగా తెలుసుకునే నాయకుడే నిజమైన ప్రజా ప్రతినిధి. ఈ విషయంలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వ్యవహరిస్తున్న తీరుపై ప్రస్తుతం నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. నిత్యం ప్రజల్లో ఉండటం, మార్నింగ్ వాక్ ద్వారా గ్రామాలు, పట్టణాల్లో ప్రజలను కలుసుకోవడం, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం వంటి కార్యక్రమాలతో ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు.**



**ఆలేరు:** సాధారణంగా నాయకులు కార్యక్రమాలు ఉన్నప్పుడే ప్రజల్లోకి వస్తారనే విమర్శలు తరచూ వినిపిస్తుంటాయి. కానీ మార్నింగ్ వాక్ పేరుతోనైనా ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవడం ఒక మంచి విధానమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

"మా సమస్య ఇది.." అంటూ ప్రజలు నేరుగా ఎమ్మెల్యేకు చెప్పే అవకాశం కల్పిస్తే.. సమస్యలు అధికారుల దృష్టికి వెళ్లే అవకాశం ఉంటుంది. ప్రజా ప్రతినిధి అందుబాటులో ఉండటమే ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుంది.

ఒక్క బీర్ల ఐలయ్య కాదు.. ప్రతి ఎమ్మెల్యే ఇదే బాటలో నడవాలి!

తెలంగాణలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే కాదు.. ప్రతిపక్ష పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాల్లో నిత్యం పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటే రాష్ట్రంలో ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంటుంది.

బీర్ల ఐలయ్య చేస్తున్న కార్యక్రమాల్లో కనీసం 20 శాతం సమయాన్ని ప్రతి ఎమ్మెల్యే ప్రజల కోసం కేటాయిస్తే.. ప్రజలకు పాలన మరింత చేరువ అవుతుంది.

ఎమ్మెల్యే అంటే కేవలం ఎన్నికల సమయంలో కనిపించే వ్యక్తి కాదు. ఐదేళ్ల పాటు ప్రజల మధ్య ఉండే బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధి.

డబ్బుతో కాదు.. ప్రజల నమ్మకంతో గెలవాలి!

ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి నాయకుడు ఒక విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

ప్రజలు ఓటు వేసేది డబ్బు చూసి కాదు.. తమ భవిష్యత్తును చూసి. డబ్బు ఉందని ఖర్చు చేసి అధికారంలోకి రావచ్చని ఎవరైనా భావిస్తే అది రాజకీయాల్లో శాశ్వత సూత్రం కాదు. ప్రజలు ఒకసారి అధికారాన్ని అప్పగిస్తారు.. కానీ ఆ అధికారాన్ని నిలబెట్టేది మాత్రం ప్రజలతో ఉన్న సంబంధం, చేసిన పని, అందుబాటులో ఉన్న తీరు.

ఇంకా రెండున్నరేళ్లు ఉన్నాయి.. ఇప్పటికైనా మేల్కొనాలి!

ప్రస్తుత పాలనా కాలంలో ఇంకా సమయం ఉంది. ఇప్పటికైనా ప్రతి ఎమ్మెల్యే తమ నియోజకవర్గాలపై దృష్టి పెట్టాలి. గ్రామాల్లో పర్యటించాలి. ప్రజలతో మాట్లాడాలి. సమస్యలను తెలుసుకోవాలి. అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి కృషి చేయాలి.

లేకపోతే "ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకులు" అనే ముద్ర పడే ప్రమాదం ఉంది.

ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఎవరు తమ మధ్య ఉన్నారు? ఎవరు సమస్య వచ్చినప్పుడు స్పందిస్తున్నారు? ఎవరు కేవలం రాజకీయాలకే పరిమితమవుతున్నారు? అన్నది ప్రజలకు తెలుసు.

ప్రజల తీర్పు ముందు ఎవరి లెక్కలు పనిచేయవు!

ఎన్నికల సమయంలో ఎన్ని హామీలు ఇచ్చినా.. ఎంత ప్రచారం చేసినా.. చివరకు ప్రజల తీర్పే కీలకం.

ప్రజలకు సేవ చేస్తే ప్రజలు గుర్తుపెట్టుకుంటారు.

ప్రజలను పట్టించుకోకపోతే ప్రజలు కూడా ఎన్నికల సమయంలోనే సమాధానం చెబుతారు.

అందుకే తెలంగాణలోని ప్రతి ఎమ్మెల్యే ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రజల్లోకి వెళ్తున్న విధానాన్ని ఒక ఉదాహరణగా తీసుకుని, తమ నియోజకవర్గాల్లో ప్రజలకు మరింత చేరువ కావాల్సిన అవసరం ఉంది.

నాయకుడు ప్రజల దగ్గరకు వెళ్తే.. సమస్యలు నాయకుడి దగ్గరకు వస్తాయి.

నాయకుడు ప్రజలకు దూరమైతే.. ప్రజలు కూడా నాయకుడికి దూరమవుతారు.

జనం వార్త -- క్యూ6 న్యూస్ తరపున మా ప్రశ్న ఇదే:

"ప్రజలు మీకు అధికారం ఇచ్చారు.. ఆ అధికారాన్ని ప్రజల కోసం ఎంతవరకు ఉపయోగిస్తున్నారు?"



**గడ్డమీది నాగరాజు పటేల్**
**చైర్మన్ Q6 న్యూస్ । జనం వార్త**

## ఉప్పల్ బగాయతులో 13న భూమి పూజ





- భూమి పూజకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- వేల సంఖ్యలో ఆర్యవైశ్య ప్రతినిధులు తరలి రావాలి
- రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పిలుపు.



**ఉప్పల్,సెప్టెంబర్ 7(జనంవార్త) :** ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని బగాయత్ లో రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల కోసం కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో నిర్మించే ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి ఆర్య వైశ్యులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం ఉప్పల్ బగాయతులో జరిగిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరవాది మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన నిర్వహించే భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్రంలోని ఆర్యవైశ్య సోదరీ సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలోని ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు బాధ్యత వహించి అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని వైశ్యుల సత్తా ను చాటాలని,రాబోయే ఎన్నికల్లో మన ఐక్యత ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సుమారు 30 కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో అంగరంగ వైభవంగా నిర్మాణం జరగనుందని ఆయన వివరించారు. భూమి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ కీలక భూమిక పోషించాలని అధ్యక్ష కార్యదర్శులు బెలిదే రమేష్ గుప్తా,బచ్చు నగేష్ గుప్తా లకు సూచించారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉప్పల్ బగాయతులో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ భవన సముదాయం ఏర్పాటు కావడం జిల్లాకే గర్వకారణమని మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి బెలిదే రమేష్ గుప్తా , బచ్చు నగేష్ గుప్త లు అన్నారు. భవన సముదాయ నిర్మాణంలో తమ వంతు బాధ్యతగా కీలకపాత్రను పోషిస్తామని తెలిపారు. మేడ్చల్ జిల్లాలోని ఆర్యవైశ్యులందరూ ఈనెల 13న జరిగే భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి విచ్చేస్తున్నందున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ప్రభుత్వం కేటాయించిన ఉప్పల్ భగత్ స్థలంలో ఉదయం 8 గంటలకు శ్రీనివాస కళ్యాణం నిర్వహిస్తున్నామని దంపతులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొనవచ్చు అని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ కమిటీ చైర్మన్ అగ్గి వెంకటేష్, మాజీ కోశాధికారి నేతి రాములు,ఉపాధ్యక్షుడు ఊరే లక్ష్మణ్ ,మేడ్చల్ మల్క్గిరి జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు భెలిదే రమేష్,ప్రధాన కార్యదర్శి బచ్చు నగేష్ కుమార్,మెంబర్ షిప్ కమిటీ చైర్మన్ పెరుమాళ్ అనిల్ బాబు, కాసం వెంకట హరి, పెద్ది శ్రీనివాస్, తారకేష్, రమేష్, బిక్కుమల్ల రమేష్, పొద్దుటూరు నర్సింగరావు, సత్యనారాయణ, పవన్,సుధాకర్,శ్రీను,సంతోష్ రాష్ట్ర మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి సామ్రాజ్య లక్ష్మి,ఉపాధ్యక్షురాలు బచ్చు సుదీప,భెలిదే వసంత,బచ్చు సరిత,పోలా చందన,శిరీష,వివిధ మండలాల,పట్టణ అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, సభ్యులు,ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆత్మరక్షణకు అస్త్రం.. కరాటే!

**యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు బురాని శ్రీకాంత్**

**దుబ్బాక, సెప్టెంబర్ 07: (జనం వార్త) :** నేటి ఆధునిక సమాజంలో బాలికలు, యువత ఎదుర్కొనే సవాళ్లను ధైర్యంగా తిప్పికొట్టేందుకు ఆత్మరక్షణ విద్య అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. కేవలం రక్షణే కాకుండా,విద్యార్థులలో మానసిక స్థైర్యాన్ని, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడంలో కరాటే కీలక పాత్ర పోషిస్తోంది. ఇదే లక్ష్యంతో యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ (తెలంగాణ) నిరంతరం శ్రమిస్తోందని అకాడమీ వ్యవస్థాపకులు, ప్రముఖ కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఉత్సాహభరిత వాతావరణంలో బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద చీకోడ్ గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలను అత్యంత కన్నులపండువగా నిర్వహించారు. కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ తో పాటు సుశాంక్ వర్ధన్, హర్షవర్ధన్, పీటీఈ శ్రీనివాస్ గౌడ్ నిపుణులైన పరిశీలకులుగా వ్యవహరించి విద్యార్థుల ప్రదర్శనను నిశితంగా పరిశీలించారు. భదుబ్బాక మండలం నలుమూలల నుంచి 50 మందికి పైగా ఉత్సాహవంతులైన విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొని తమ సత్తా చాటారు. పట్టుదలతో కఠిన సాధన చేసి బెల్ట్‌లు సాధించిన ప్రతి ఒక్క విద్యార్థిని మాస్టర్ బి. శ్రీకాంత్ మరియు పిఈటి శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక అతిథులు అభినందించారు. విద్యార్థులు కేవలం స్థానిక స్థాయికే పరిమితం కాకుండా, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడా వేదికలపై రాణించి అకాడమీకి, తమ తల్లిదండ్రులకు మరియు ఊరికి పేరు తెచ్చిపెట్టాలని ఆకాంక్షించారు. మీ పిల్లల్లో ఆత్మవిశ్వాసం,నాయకత్వ లక్షణాలు మరియు శారీరక దారుఢ్యం పెంపొందాలంటే నేడే వారిని కరాటే శిక్షణ వైపు ప్రోత్సహించండని కోరారు.







## అక్రమ అరెస్టులతో అడ్డుకోవడం కాంగ్రెస్ సర్కార్ పిరికితనానికి నిదర్శనం!

- అరెస్టులు చేస్తే ఆగేది ఏమి లేదు
- నాయకులకు చానా బలం
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్

**దుబ్బాక సెప్టెంబర్ 7 ( జనం వార్త) :** 15 వేల కోట్ల ఫీజు బకాయిలు ఎగ్గొట్టి 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాలరాస్తున్న రేవంత్ సర్కార్ పై బిజెపి సాగిస్తున్న "ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు పిలుపుమేరకు ఈరోజు చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళుతున్న భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ ను ఈరోజు తెల్లవారుజామున దుబ్బాక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బాలేష్ గౌడ్ దుబ్బాకలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంతోమంది నీరు పేద బడుగు బలహీన వర్గాల పిల్లల ఉన్నత విద్యకు ఉపయోగకరంగా ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేసే కుట్రలు పన్నుతుందని, ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు బిజెపి చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్బంధాన్ని కొనసాగిస్తూ బీజేపీ కార్యకర్తలని నాయకులని ఎక్కడికి అక్కడ అరెస్టు చేస్తున్నదని ఆరోపించారు. శాంతియుతంగా ఇందిరాపార్క్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని చేపట్టిన భారతీయ జనతా పార్టీకి ప్రభుత్వం అనుమతించకుండా అడ్డుకోవడం సిగ్గుచేటని, ప్రభుత్వ అనుమతి లభించకపోవడంతోనే పార్టీ చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చిందనిఅన్నారు. నగత 18 సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యకు దూరంగా ఉంటున్న నీరు పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ప్రారంభించారని, అప్పటినుండి కొనసాగుతున్న ఈ పథకాన్ని ఎత్తివేసేలా నేటి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్ షిప్ లు చెల్లించకుండా విద్యకు దూరం చేసే కుట్రలు పన్నుతుందని అన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు నాలుగు సంవత్సరాల ఫీజు రియంబర్స్మెంట్ ను కళాశాలకు విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను, తల్లిదండ్రులను ఫీజులు చెల్లించాలని వేధిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రతి ఏటా మూడు లక్షల కోట్ల బడ్జెట్ను ప్రవేశపెడుతున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం విద్యార్థులకు అవసరమయ్యే 2500 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఇందులో కేవలం విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే కుట్రలు పన్నుతున్నట్టు అనిపిస్తుంది అని అన్నారు. అధికారంలోకి వచ్చినప్పటినుండి రియంబర్స్మెంట్ చెల్లించని కాంగ్రెస్ ప్రభుత్వం, కళాశాల యాజమాన్యాలకు లబ్ధి చేకూర్చేలా ఇటీవలనే 30% ఫీజు పెంచేలా అవకాశం ఇవ్వడం పేద తల్లిదండ్రులపై మరింత భారాన్ని పెంచిందని, ఈ ప్రభుత్వం పేద విద్యార్థుల పాలిట శనిల దాపరించిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదిరించి విద్యార్థులతో కలిసి భారతీయ జనతా పార్టీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందని అన్నారు. బాలేష్ గౌడ్ తో పాటు బిజెపి మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, సుంకోజు ప్రవీణ్ కుమార్, రమేష్ రెడ్డి, రమణారెడ్డి, నేహాల్ గౌడ్, మనోజ్ గౌడ్ తదితరులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు



## కొలనుపాక సోమేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు



**ఆలేరు:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్వామివారికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు, ఆలేరు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని శ్రీ సోమేశ్వర స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

## నిరుద్యోగులపై బురదజల్లుతారా?

- కష్టపడి మెగా డీఎస్సీ సాధించారు
- ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఫైర్

**అమరావతి,సెప్టెంబర్7 :** మెగా డీఎస్సీలో ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల శ్రమను, వారి విజయాన్ని అవమానించేలా వైసీపీ నేతలు చౌకబారు ఆరోపణలు చేయడం అత్యంత బాధాకరమని ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మెగా డీఎస్సీ సాధించిన అభ్యర్థులను వేధించడం, వారిపై బురదజల్లడాన్ని వైసీపీ నేతలు వెంటనే మానుకోవాలని హితవు పలికారు. 2018 డీఎస్సీలో తృటిలో ఉద్యోగం కోల్పోయినప్పటికీ నిరాశ చెందకుండా.. ఏడేళ్ల పాటు పట్టుదలతో, రాత్రింబవళ్లు తేడా లేకుండా చదివి ఎన్నో త్యాగాలు చేసి 2025 మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని మంత్రి కొనియాడారు. వారి విజయాన్ని స్వార్థ రాజకీయాల కోసం అవమానించడం తగదని మండిపడ్డారు. అప్లికేషన్ల స్వీకరణ నుంచి మెరిట్ జాబితా విడుదల వరకు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేసిందని స్పష్టం చేశారు. మెరిట్, అర్హత ప్రాతిపదికన ఉద్యోగాలు సాధించిన వారి కష్టాన్ని ప్రశ్నించడం ఆయా అభ్యర్థుల కుటుంబాల త్యాగాలను అవమానించడమేనని ధ్వజమెత్తారు. యువత భవిష్యత్తుతో రాజకీయ క్రీడలొద్దని, అభ్యర్థుల ఆవేదనను గ్రహించి జగన్ తక్షణమే తన వైఖరిని మార్చుకోవాలని అన్నారు.

## ఏపీలోని పలు ప్రాంతాలకు భారీ వర్ష సూచన

**అమరావతి, సెప్టెంబర్ 7 :** ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు కీలక జిల్లాలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) రెడ్ అలర్ట్ జారీ చేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో రాబోయే మూడు గంటల్లో వాతావరణం ఒక్కసారిగా మారనుందని హెచ్చరించింది. ఈ ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా ప్రజలను అప్రమత్తం చేసింది. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని పలు ప్రాంతాలపై ప్రభావం అధికంగా ఉండనుందని విపత్తుల సంస్థ పేర్కొంది. ముఖ్యంగా గురజాల, మాచర్ల, దర్శి, కందుకూరు, ఒంగోలు, బాపట్ల, గుంటూరు, పిడుగురాళ్ల, నరసరావుపేట, చిలకలూరిపేటతో పాటు వాటి పరిసర ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వర్షంతో పాటు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, రైతులు, వాహనదారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీఎస్డీఎంఏ విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద, ఇతర తాత్కాలిక షెడ్ల కింద నిలబడటం అత్యంత ప్రమాదకరమని స్పష్టం చేసింది. ప్రజలు వీలైనంత వరకు ఇళ్లకే పరిమితం కావాలని కోరింది.

## ఏపీ వక్ఫ్ బోర్డు డిజిటల్ పాలనలో మరో ముందడుగు

- త్వరలో వెబ్‌సైట్, మొబైల్ యాప్ ప్రారంభం
- ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

**అమరావతి, సెప్టెంబర్ 7 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డును ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక ముందడుగు పడిందని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. బోర్డు సేవలు, కార్యకలాపాలను డిజిటలైజ్ చేసేందుకు ప్రత్యేకంగా వెబ్‌సైట్, మొబైల్ యాప్ రూపొందించామని, త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో సీఈఓ యాకూబ్ ఖాజీ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో చైర్మన్ అబ్దుల్ అజీజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని సందేశం అందించారు. చైర్మన్ మాట్లాడుతూ, కొత్త వ్యవస్థను ప్రారంభించడం ఒక్కటే కాదని, దాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యమని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ఈ డిజిటల్ మార్పులో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కొనసాగుతున్న డిజిటల్ గవర్నెన్స్‌కు అనుగుణంగా వక్ఫ్ బోర్డులోనూ ఆధునిక సాంకేతిక విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అధికారిక ప్రారంభానికి ముందే సిబ్బందిని కొత్త వ్యవస్థ వినియోగానికి సిద్ధం చేస్తున్నామని, తద్వారా పరిపాలనలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. చైర్మన్ సందేశం అనంతరం ప్రాక్టికల్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి, వెబ్‌సైట్, మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. లాగిన్, సమాచార నమోదు, ఇప్పటికే ఉన్న వివరాల పరిశీలన, అప్‌డేషన్, క్షేత్రస్థాయి సమాచారాన్ని డిజిటల్ వ్యవస్థలో పొందుపరిచే విధానాలను దశలవారీగా వివరించారు.

# ఉమ్మడి చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంతానికి జేజేఎం–అమరజీవి జలధారలు

- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో తాగు నీటి సమస్యకు పరిష్కారం
- ఇంటేక్ వెల్, నీటి శుద్ధి కేంద్రాలు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల పనుల్లో పురోగతి
- 130 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం పూర్తి
- 18 మండలాలు, 3,163 ఆవాసాలకు స్వచ్ఛమైన తాగునీరు లక్ష్యం
- దాదాపు 25 లక్షల మంది ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత



**అత్యంత తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో చేపట్టిన తాగు నీటి ప్రాజెక్టుల పనులు వారాంతపు లక్ష్యాలు నిర్దేశించుకుని త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. ఏడాది చివరినాటికి పూర్తి చేయాల్సిన లక్ష్యాలను నెలవారీ, వారాల వారీగా విభజించుకుని, ఎప్పటికప్పుడు పూర్తికావాల్సిన పనులపై సమీక్షించుకోవాలని స్పష్టం చేశారు. తద్వారా వేగంగా నిర్మాణం పూర్తి చేసి, గడువులోపు ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల కింద రూ. 2,370 కోట్లతో చేపట్టిన చిత్తూరు మల్టీ విలేజ్ స్కీమ్ పనుల పురోగతిపై సమీక్షించారు. ప్రాజెక్టు నిర్మాణం, పైప్‌లైన్ నిర్మాణం కోసం వివిధ శాఖల నుంచి పొందాల్సిన అనుమతులు తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందాలి. ప్రతి గొంతు దాహార్తి తీరాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జల్ జీవన్ మిషన్ సంకల్పాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అమరజీవి జలధారలుగా ముందుకు తీసుకువెళ్తున్నారు. అత్యంత నీటి ఎద్దడి కలిగిన ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తున్నారు.**

**మంగళగిరి, సెప్టెంబర్ 7 :** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, 2024తో ముగిసిన జల్ జీవన్ మిషన్ గడువును 2028 వరకు పొడిగించారు. జల్ జీవన్ మిషన్ 2.0 కింద దాదాపు రూ. 26,000 కోట్ల విలువ చేసే తాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్తున్నారు. అందులో మొదటి విడతగా రూ. 7,910 కోట్లతో ఐదు జిల్లాల పరిధిలో చేపట్టిన ఐదు మెగా వాటర్ గ్రిడ్ పథకాల్లో చిత్తూరు కూడా ఒకటి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలకు శాశ్వత



తాగునీటి భద్రత కల్పించేందుకు జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార నిధులతో రూ. 2,370 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిష్ఠాత్మక తాగునీటి సరఫరా పనులు చేపట్టారు. గండికోట, వెలిగల్లు జలాశయాలను నీటి వనరులుగా వినియోగిస్తూ అమలవుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా మూడు నియోజకవర్గాల పరిధిలోని 18 మండలాల్లో ఉన్న 3,163 ఆవాసాలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించనున్నారు. సుమారు 25 లక్షల మంది ప్రజలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. చిత్తూరు మల్టీ విలేజ్ తాగునీటి పథకానికి సంబంధించి గండికోట వద్ద నిర్మాణం చేపట్టిన ఒక ఇంటేక్ వెల్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. నాలుగు రా వాటర్ సంపులు నిర్మించాల్సి ఉండగా, అందులో మూడు పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం, గుర్రంకొండ వద్ద 75 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఒక నీటి శుద్ధి కేంద్రం, వెలిగల్లు వద్ద 26 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో మరో నీటి శుద్ధి కేంద్రం నిర్మాణ దశలో ఉన్నాయి. ఏడు నీటి సంపులు, ఐదు ఓవర్‌హెడ్ ట్యాంకులు, 14 గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు తదితర 167 పనులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపు 130 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం కూడా పూర్తయ్యింది. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా చేపట్టాలని కళ్యాణ్ సూచించారు.



## ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ డిజైన్, డీపీఆర్ పనులు ప్రారంభం

- సర్వే ప్రారంభించిన ఐఐటీ మద్రాస్
- తీర ప్రాంతం వెంబడి ఐదుగురు సభ్యుల నిపుణుల బృందం డ్రోన్ సర్వే
- అత్యాధునిక సాంకేతికతతో బీచ్ ప్రొఫైల్, తీరాల మ్యాపింగ్ చేస్తున్న బృందం
- తీరం వెంబడి ఇసుక, మట్టి అవశేషాల నమూనాల సేకరణ, పరీక్షలు
- అధ్యయనం పూర్తయిన అనంతరం రక్షణ గోడ అలైన్‌మెంట్‌పై కసరత్తులు



**మంగళగిరి, సెప్టెంబర్ 7 :** పిఠాపురం నియోజక వర్గంలోని ఉప్పాడ తీర ప్రాంతవాసుల దశాబ్దాల కల సాకారం దిశగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ పత్యేక చొరవతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం దిశగా కీలక అడుగులు ప్రారంభమయ్యాయి. రక్షణ గోడ నిర్మాణానికి సాంకేతిక సహకారం అందించేందుకు ఒప్పందం చేసుకున్న ఐఐటీ- మద్రాస్ పనిని ప్రారంభించింది. రూ. 323 కోట్లనేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్‌తో నిర్మితమవుతున్న ఈ రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి డిజైన్, డీపీఆర్ రూపకల్పన కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఐఐటీ మద్రాస్ ప్రతినిధి బృందం అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానంతో సముద్ర గర్భంలోనూ, తీర ప్రాంతం వెంబడి సర్వే చేపట్టింది. తీర ప్రాంత ఇంజినీరింగ్, సముద్ర పరిశోధనల్లో విశేష అనుభవం కలిగిన ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందం గత వారం రోజులుగా ఉప్పాడ తీర ప్రాంతంలో క్షేత్రస్థాయి సర్వేలు చేపట్టింది. అధునాతన డ్రోన్లతోపాటు బీచ్ ప్రొఫైలింగ్, తీర ప్రాంతాల మ్యాపింగ్ కోసం ట్రింబుల్ ఆర్980 జీఎన్ఎస్ఎస్ ఆర్‌టీకే సాంకేతికతను వినియోగిస్తున్నారు. తీర ప్రాంత భౌగోళిక పరిస్థితులు, సముద్ర అలల ప్రభావం, తీర కోత తీవ్రత, భూభాగ మార్పులు, సముద్ర ప్రవాహాల దిశలు వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం చేస్తున్నారు.

నీటి అడుగు భాగం నుంచి బీచ్ వరకు ఇసుక కణాల సేకరణ, సమగ్ర అధ్యయనం సాగుతోంది. వీటితోపాటు ఉప్పాడ తీర ప్రాంతం వెంబడి ఇసుక, మట్టి అవశేషాల నమూనాలు సేకరించి, శాస్త్రీయ అధ్యయన ప్రక్రియ కొనసాగిస్తున్నారు. బాతిమెట్రిక్ సర్వే ద్వారా సముద్రపు లోతు, సీ బెడ్ స్థాయిలు, వాటి మార్పులను గుర్తిస్తున్నారు. బీచ్ ఆకృతి, వాలు, ఎత్తుపై అధ్యయనం కొనసాగుతోంది. షోర్‌లైన్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. తీర ప్రాంత కోతను అంచనా వేయడంలో ఈ అధ్యయనం కీలక పాత్ర పోషిస్తుంది. ఉప్పాడ సముద్ర తీరం వెంబడి ప్రతిపాదిత రక్షణ గోడ నిర్మాణానికి అనువైన అలైన్‌మెంట్‌ను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. భవిష్యత్తులో సముద్ర కోత ప్రభావాన్ని సమర్థవంతంగా, సుదీర్ఘకాలం ఎదుర్కొనే విధంగా డిజైన్ రూపకల్పనకు ఈ సర్వే ఉపయోగపడుతుంది. ఈ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఐఐటీ మద్రాస్ ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి డిజైన్, డీపీఆర్ తదితర సాంకేతిక అంశాలపై దృష్టి సారించనుంది. గత నాలుగు దశాబ్దాలుగా ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు సముద్ర కోత సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే వందల ఎకరాలు, పలు గ్రామాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. ఎంతో మంది నిర్వాసితులు కాగా, రైతులు వందల ఎకరాల పంట భూములను సైతం కోల్పోయారు. ఈ సమస్య పరిష్కారానికి నడుం బిగించిన ఉప ముఖ్యమంత్రి, సముద్ర కోత సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో చర్యలు చేపట్టారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) ప్రతిపాదన మేరకు సీ ప్రొటెక్షన్ వాల్ , గ్రోయిన్ ఫీల్డ్, హోప్ ఐలాండ్ పరిసరాల్లో ప్రకృతి ఆధారిత తీర రక్షణ చర్యలు చేపట్టేందుకు ఆమోదం లభించింది. అందుకు అనుగుణంగా డీపీఆర్ రూపకల్పన పనులు ప్రారంభమయ్యాయి. పిఠాపురం పర్యటన సందర్భంగా డిజైన్, డీపీఆర్ పై ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందంతో చర్చించనున్నారు. నిర్ణీత గడువు లోపు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా డిజైన్, డీపీఆర్ రూపకల్పన సమాంతరంగా పర్యావరణ, తదితర అనుమతుల ప్రక్రియ పూర్తి చేసి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని ఆదేశించారు.



## మృతురాలి కుటుంబానికి అఖిల రాజ్ ఫౌండేషన్ 50 కిలోల బియ్యం అందజేత

**దుబ్బాక సెప్టెంబర్ 07 :( జనం వార్త) :** దుబ్బాక మండల పరిధిలోని రాజక్కపేట గ్రామానికి చెందిన కొప్పు నర్సవ్వ సెప్టెంబర్ 02 బుధవారం రోజున గుండె పోటుతో మరణించిన విషయం తెలుసుకొని అఖిల రాజ్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం రోజున వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు కూకట్ పల్లి ఎస్ ఐ తౌడా సత్యనారాయణ సూచన మేరకు మృతురాలి కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తామన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడమే ఫౌండేషన్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాకనాటి సునీల్ కుమార్, గుంటి రాహుల్ , గ్రామ ఫౌండేషన్ సభ్యులు కరికే నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాధనం ఖర్చు చేస్తూ ప్రజలకు దూరంగా ఉంటున్న కేసీఆర్ రాజీనామా చేయాలి

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ కొడె మహేష్ కురుమ**



**మేడ్చల్:** ప్రజాధనంతో జీతభత్యాలు పొందుతూ ప్రజలకు, శాసనసభకు దూరంగా ఉంటున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత, శాసనసభ ప్రతిపక్ష నేత కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) తక్షణమే ఎమ్మెల్యే పదవికి, ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ కొడె మహేష్ కురుమ డిమాండ్ చేశారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను శాసనసభలో ప్రస్తావించి, వారి గొంతుకగా నిలవాల్సిన ప్రతిపక్ష నేత తన బాధ్యతలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. శాసనసభ సమావేశాలకు హాజరుకాకుండా ప్రజలకు దూరంగా ఉంటున్న కేసీఆర్‌కు ప్రతిపక్ష నేతగా కొనసాగేందుకు నైతిక అర్హత లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధి కంటే విధ్వంసమే ఎక్కువగా జరిగిందని మహేష్ కురుమ విమర్శించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాల్సిన కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని ఆరోపించారు. కేసీఆర్‌కు ప్రతిపక్ష నేత హోదాలో జీతభత్యాలు, భద్రత, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, ఇతర సౌకర్యాల కోసం ప్రజాధనం ఖర్చవుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రజల సొమ్ముతో సౌకర్యాలు పొందుతూ ప్రజలకు అందుబాటులో లేకపోవడం సమంజసం కాదన్నారు. కేసీఆర్ తక్షణమే తన పదవులకు రాజీనామా చేసి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందని మహేష్ కురుమ తెలిపారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ముందుకు సాగుతోందని ఆయన అన్నారు.

# మారుతీ సుజుకీ షాక్.. మళ్లీ ధరల పెంపు




ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ తన వినియోగదారులకు మళ్లీ ధరల షాక్ ఇచ్చింది. ఎంపిక చేసిన కొన్ని మోడళ్లపై రూ.20 వేల వరకు ధరలను పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. సవరించిన ధరలు సెప్టెంబర్ నుంచే అమల్లోకి వస్తాయని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ముడిసరుకుల ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. కాగా.. ఈ ఏడాది మే నెల నుంచి మారుతీ సుజుకీ కార్ల ధరలు పెరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం. "గత కొన్ని నెలలుగా వ్యయాన్ని నియంత్రించి ధరలను అందుబాటులోనే ఉంచేందుకు ప్రయత్నించాం. కానీ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ప్రతికూల ఆర్థిక పరిస్థితుల వల్ల అనివార్యంగా ధరలు పెంచాల్సి వస్తోంది. ఎంపిక చేసిన మోడళ్ల ధరలను రూ.20 వేల వరకు పెంచాం" అని కంపెనీ వెల్లడించింది. వినియోగదారులపై ఈ భారం సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చూసుకుంటామని తెలిపింది. మారుతీ సుజుకీ ప్రస్తుతం ఎస్-ప్రెస్సో వంటి ఎంట్రీలెవల్ మోడళ్ల నుంచి ప్రీమియం యుటిలిటీ వెహికల్ అయిన ఇన్విక్టో వరకు పలు మోడళ్లను విక్రయిస్తోంది.






# 23,800 దిగువకు నిఫ్టీ

**ముంబాయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులు, చమురు ధరలు పెరగడం మార్కెట్‌పై ప్రభావం చూపింది. అమెరికా వడ్డీ రేట్లను పెంచుతుందనే భయాలతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఐటీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంకు షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఇన్ఫోసిస్ షేర్లు 3 శాతానికి పైగా కుంగాయి. టాటా స్టీల్, టెక్ మహీంద్రా షేర్లు 2 శాతం మేర పడ్డాయి. దీంతో సూచీలకు నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ ఉదయం 76,446.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,515.43) నష్టాల్లో ప్రారంభమైన సూచీ.. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,970.52 వద్ద కనిష్ఠానికి పడిపోయి.. చివరికి 382.62 పాయింట్లు పతనమై 76,132.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 118.55 పాయింట్లు కోల్పోయి 23,779.15 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.48గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్రా, టాటాస్టీల్, బజాజ్‌ఫిన్‌సర్వ్, అల్ట్రా సిమెంట్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎల్‌అండ్‌టీ, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ, పవర్‌గ్రిడ్, ఐసీఐసీఐ, ఇండిగో షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 96.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4,402.79 వద్ద కొనసాగుతోంది.




### భారత్ - జపాన్ మధ్య ప్రతిష్ఠాత్మక మ్యాచ్..

# యూట్యూబ్‌లో లైవ్?

ఆసియా క్రీడల ముంగిట జపాన్‌తో టీమ్ఇండియా ఏకైక టీ20 మ్యాచ్ ఆడనుంది. శానో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా సెప్టెంబర్ 22న మ్యాచ్ జరగనుంది. భారత్-జపాన్ ద్వైపాక్షిక సంబంధాల 75వ వార్షికోత్సవ సంబరాల ప్రారంభ సూచికగా దీన్ని నిర్వహిస్తున్నారు. అయితే, ఈ మ్యాచ్‌కు జపాన్‌లో ఓ సమస్య ఎదురు కాగా.. ఎలా పరిష్కరిస్తానేది ఆసక్తికరంగా మారింది. భారత్ - జపాన్ ఏకైక టీ20 మ్యాచ్ ప్రసార హక్కులను తీసుకోవాలని ఇప్పటికే ఐటీడబ్ల్యూ యూనివర్స్‌తో జపాన్ క్రికెట్ అసోసియేషన్ చర్చించినట్లు వార్తలు వస్తున్నాయి. ఆసియా క్రీడలు ప్రారంభానికి రెండు రోజుల ముందే ఈ మ్యాచ్ జరగనుంది. దీంతో నిర్వహణపరమైన సవాళు ఎదురవుతాయని బ్రాడ్‌కాస్టర్లు ఆలోచనలో పడినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికీ టీవీ బ్రాడ్‌కాస్టింగ్ కూడా ఫైనలైజ్ కాలేదు. దీంతో యూట్యూబ్‌లో లైవ్ ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇది కేవలం జపాన్‌లో నేనని.. భారత్‌లో ఫ్యాన్‌కోడ్‌తో కలిసి బ్రాడ్‌కాస్ట్ చేసే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇక ఐటీడబ్ల్యూ సంస్థ స్టార్, సోనీ, జీ వంటి సంస్థలతోనూ చర్చలు జరుపుతోంది. మరోవైపు ఆసియా గేమ్స్‌లో మహిళా క్రికెట్ ఫైనల్ కూడా అదే రోజు. ఇందులో భారతే 'గోల్డ్ మెడల్' ఫేవరెట్. ఆ మ్యాచ్ ముగిసిన రెండు గంటల్లోనే భారత్ - జపాన్ పోరు జరగనుంది. దీంతో ఒకేరోజు రెండు మ్యాచులు ప్రసారం చేయడం జపాన్ బ్రాడ్‌కాస్టర్లకు సవాల్‌తో కూడుకున్నదే. "సంప్రదాయ పరిధులను దాటి క్రికెట్‌ను ప్రపంచ వ్యాప్తం చేసేందుకు ఇలాంటి మ్యాచులు దోహదపడతాయి. అందుకు భారత్ - జపాన్ మ్యాచ్‌నే కీలక అడుగుగా భావిస్తున్నాం. 22వ తేదీన ఇరుజట్లు తలపడతాయి. జపాన్‌కు అంతర్జాతీయ క్రికెట్ శోభను తీసుకొస్తుందనడంలో సందేహం లేదు. కొత్త అభిమానులు వస్తారు. ఈ ప్రాంతంలో క్రికెట్‌ను విస్తరించేందుకు అవకాశాలు ఏర్పడతాయి" అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు.

# స్వదేశం కోసం పనిచేయాలంటే భయం

### పాక్ మాజీ స్టార్ సంచలన వ్యాఖ్యలు



ఏ క్రికెటర్ అయినా సరే ఆటకు వీడ్కోలు పలికినా కూడా స్వదేశానికి ఎంతోకొంత సేవ చేయడానికి ఆసక్తి చూపిస్తాడు. కానీ, పాకిస్థాన్ మాజీల్లో కొందరి పరిస్థితి ఇందుకు భిన్నం. సొంత దేశం కోసం పనిచేయాలంటే భయం వేస్తోందని పాక్ మాజీ క్రికెటర్ ముస్తాక్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఇటీవల ఇంగ్లాండ్‌తో రెండు టెస్టుల్లోనూ ఘోరమైన ప్రదర్శనతో పాకిస్థాన్ టీమ్ విమర్శలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. దీంతో ప్లేయర్లతోపాటు ఇద్దరు కోచ్‌లపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వేటు వేసింది. అయితే ఇలా పర్యటన మధ్యలోనే చర్యలు తీసుకోవడం సరైంది కాదని ముస్తాక్ అభిప్రాయపడ్డారు. గతంలో పీసీబీలో పని చేసిన ఆయన.. బంగ్లాదేశ్‌కు స్పిన్ కోచ్‌గానూ వ్యవహరించారు. "నా సొంత దేశానికి సేవ చేయడానికి ఎప్పుడూ సిద్ధమే. కోచింగ్ బాధ్యతలకూ వెనుకాడబోను. ఇప్పుడున్న ఆటగాళ్ల ను సవాళ్లకు సిద్ధం చేసి.. అంతర్జాతీయ క్రికెట్‌పై వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి, ప్రత్యర్థి జట్లకు గట్టి పోటీ ఇవ్వగల టీమ్‌ను తయారు చేయడానికి నాకు ఇదే అత్యంత అనువైన సమయం. కానీ, పీసీబీ మద్దతుగా నిలిస్తేనే ఇదంతా సాధ్యమవుతుంది. అయితే, సర్ఫరాజ్, గుల్‌ను తప్పించినప్పుడు ఓ క్రికెటర్‌గా నేను బాధపడ్డా. గౌరవం లేని చోట లేదా ఉన్నట్టుంది ఏదో కారణం చెప్పి తొలగిస్తే గనుక.. సొంత దేశం కోసం పనిచేయాలంటే భయం వేస్తుంది" అని ముస్తాక్ వ్యాఖ్యానించారు. ఇటీవలే సెలక్టర్ పదవికి రాజీనామా చేసిన మిస్బా ఉల్ హక్ కూడా పీసీబీపై విమర్శలు గుప్పించాడు. "విదేశీ కోచ్‌లతో పోలిస్తే ఇక్కడి కోచ్‌లతో వ్యవహరించే తీరు పూర్తి భిన్నం. ఏదైనా ఓటమి ఎదురైతే చాలు విమర్శలు ఎక్కువగా స్వదేశీ కోచ్‌లపైనే ఉంటాయి. విదేశీ కోచ్‌లు వద్దని చెప్పట్లేదు. కానీ, వారికి అథారిటీ ఎక్కువగా ఇచ్చేస్తున్నారు" అని మిస్బా వ్యాఖ్యానించాడు. పర్యటన మధ్యలోనే ఆటగాళ్లను తప్పించడంపై సర్వత్రా విమర్శలు వస్తుంటే.. పాక్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ మాత్రం పీసీబీకి మద్దతుగా మాట్లాడటం గమనార్హం. "ఇప్పుడున్న జట్టు నుంచి పాక్ బోర్డు ఆశించిన ఫలితాలు రాలేదు. దీంతో కొందరిని తప్పించి.. కొత్త వారికి అవకాశం కల్పించింది. పాక్ జట్టు తరఫున నిబద్ధతతో ఆడే వారికే ఛాన్స్ ఇచ్చింది. అయితే, షహీన్ షా, నసీమ్ షా, హారిస్ రవూఫ్ విషయంలో బోర్డు కాస్త జాగ్రత్తగానే వ్యవహరించాలి. వీరు పాక్ క్రికెట్‌కు కీలక సభ్యులు. కొత్త జనరేషన్ నుంచి మరీ భారీ అంచనాలు పెట్టుకోవద్దు" అని అక్తర్ సూచించాడు.

# ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ

### దులీప్ ట్రోఫీ ఫైనల్లో అరుదైన చరిత్ర



దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. ఈస్ట్ జోన్ తరఫున కెప్టెన్‌గా బరిలోకి దిగిన అతడు అద్భుతమైన డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. సౌత్ జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో సోమవారం రెండో రోజు ఆటలో 200 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఆదివారం ఆట ముగిసే సమయానికి ఇషాన్ 111 పరుగులతో అజేయంగా ఉన్నాడు. రెండో రోజు కూడా అదే జోరు కొనసాగించాడు. ఈ డబుల్ సెంచరీతో దులీప్ ట్రోఫీ ఫైనల్లో 200 పరుగులు చేసిన ఐదో బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు ఈ ఘనత సాధించిన వారిలో రమణ్ లాంబా, అన్షుమన్ గైక్వాడ్, ఛతేశ్వర్ పుజారా, యశస్వి జైస్వాల్ ఉన్నారు. 1987-88 సీజన్‌లో రమణ్ లాంబా 320 పరుగులతో అత్యధిక స్కోరు నమోదు చేశాడు. అదే సీజన్‌లో అన్షుమన్ గైక్వాడ్ 216 పరుగులు చేశాడు. 2016-17లో పుజారా 256 పరుగులతో అజేయంగా నిలిచాడు. 2022-23లో యశస్వి జైస్వాల్ 209 పరుగులు చేశాడు. మొదటి రోజు ఇషాన్, కుమార్ కుశాగ్ర కలిసి ఈస్ట్ జోన్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపారు. వీరిద్దరూ 26.4 ఓవర్లలో 144 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. రోజు ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ 385/4తో నిలిచింది. రెండో రోజు కుశాగ్ర కూడా సెంచరీ పూర్తి చేసి ఔటయ్యాడు. అయినా ఇషాన్ ఇన్నింగ్స్‌పై దాని ప్రభావం పడలేదు. ఈ డబుల్ సెంచరీతో ఇషాన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 4,000 పరుగుల మైలురాయిని కూడా దాటాడు. ఇదే ఫార్మాట్‌లో అతడికి ఇది 10వ సెంచరీ. సుదీర్ఘ ఫార్మాట్‌లో తన స్థానాన్ని తిరిగి సాధించేందుకు ఇషాన్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఇన్నింగ్స్ మరింత బలాన్నిచ్చింది. ఈస్ట్ జోన్ చివరిసారిగా 13 ఏళ్ల క్రితం దులీప్ ట్రోఫీని గెలిచింది. ప్రస్తుత ఫైనల్లో ఆ జట్టు ఆధిపత్యంలో ఉంది. బౌలర్లు రాణిస్తే రెండోసారి బ్యాటింగ్ చేయకుండానే టైటిల్ గెలిచే అవకాశం ఉంది.

# వరల్డ్ కప్‌లో భువీ ఉండాల్సిందే..

### సెలక్టర్లకు మాజీ క్రికెటర్ విజ్ఞప్తి




భారత జట్టుకు విశేష సేవలందించిన సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్‌కు 2027 వన్డే ప్రపంచకప్‌లో అవకాశం కల్పించాలని భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా డిమాండ్ చేశారు. ఐపీఎల్ తో పాటు ఇటీవల ముగిసిన యూపీ టీ20 లీగ్‌లో భువీ అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ క్రమంలోనే సెలెక్టర్లు భువీ పేరును పరిశీలించాలని రైనా సూచించారు. అక్టోబర్-నవంబర్ 2027లో సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల్లో వన్డే ప్రపంచకప్ జరగనుంది. ఆయా దేశాల్లో ఉండే వేగవంతమైన, స్వింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై భువనేశ్వర్ అనుభవం, బంతిపై అతనికున్న నియంత్రణ భారత జట్టు విజయాలకు ఎంతో కీలకంగా మారుతాయని రైనా అభిప్రాయపడ్డారు. యూపీ టీ20 లీగ్‌లో లక్నో ఫాల్కన్స్ జట్టు తరఫున ఆడిన భువనేశ్వర్ కుమార్ 11 మ్యాచుల్లో 14 వికెట్లు పడగొట్టారు. కేవలం వికెట్లే కాకుండా ఆయన వేసిన పొదుపైన బౌలింగ్ అందరినీ ఆకట్టుకుంది. మొత్తం 11 మ్యాచుల్లో ఆయన ఏకంగా 119 డాట్ బాల్స్ వేశారు. అంటే దాదాపు 20 ఓవర్ల పాటు ప్రత్యర్థి బ్యాటర్లకు ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా కట్టిపడేసారు. అంతేకాకుండా కేవలం 6.11 ఎకానమీ రేటుతో పరుగులు ఇచ్చి తనలోని పదును ఇంకా తగ్గలేదని నిరూపించారు. బౌలింగ్‌లో స్వింగ్, వైవిధ్యంతో ప్రత్యర్థులను తిప్పలు పెట్టడంలో భువీ శైలి ప్రత్యేకం. భారత జట్టు రాబోయే రోజుల్లో యువత, అనుభవం కలయికతో ముందుకు వెళ్లాలని రైనా ఆకాంక్షించారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ భువనేశ్వర్ కుమార్, మహమ్మద్ షమీల అనుభవానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టులో ఉన్నట్లే, బౌలింగ్ విభాగంలో ఈ ఇద్దరు సీనియర్ పేసర్లు కూడా గిల్ ప్రణాళికల్లో భాగం కావాలని తెలిపారు. ముగ్గురు లేదా నలుగురు స్పెషలిస్ట్ పేసర్లను ఎంపిక చేసే క్రమంలో భువీ అనుభవాన్ని విస్మరించకూడదని వివరించారు. ఇక మీరట్ మెవ్రిక్స్ జట్టును విజేతగా నిలిపిన రింకూ సింగ్ కెప్టెన్సీ టాలెంట్ పై కూడా రైనా ప్రశంసల జల్లు కురిపించారు. ఒత్తిడి సమయంలో రింకూ ప్రదర్శించిన వ్యూహాత్మక చతురత అద్భుతమని కొనియాడారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) యాజమాన్యం రింకూ సింగ్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. దేశవాళీ టాలెంట్‌ను వెలికితీయడంలో యూపీ టీ20 లీగ్ ఎంతగానో తోడ్పడుతోందని కొనియాడారు.

# సౌత్‌జోన్ కొంపముంచిన సిరాజ్



ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ ఆధిపత్యం చెలాయిస్తోంది. తిలక్ వర్మ సారథ్యంలోని సౌత్ జోన్‌తో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్(334 బంతుల్లో 30 ఫోర్లు, 7 సిక్స్‌లతో 270)తో డబుల్ సెంచరీతో సత్తా చాటగా.. కుమార్ కుశాగ్ర(132 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 101) సెంచరీతో చెలరేగాడు. శిఖర్ మోహన్(120 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 85), అభిమన్యు ఈశ్వరన్(86 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 72) హాఫ్ సెంచరీలతో రాణించారు. వైభవ్ సూర్యవంశీ(37 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 44) దూకుడుగా ఆడాడు. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురణ విజయ్(4/180) నాలుగు వికెట్లు తీయగా.. చామ మిలింద్, శ్రేయస్ గోపాల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. షేక్ రషీద్‌కు ఒక వికెట్ దక్కింది. మిగతా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. ముఖ్యంగా మహమ్మద్ సిరాజ్ తీవ్రంగా నిరాశపర్చాడు. 25 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక వికెట్ తీయకపోగా.. 5.60 ఎకానమీతో 140 పరుగులిచ్చుకున్నాడు. అతని వైఫల్యం ఈస్ట్ జోన్‌కు కలిసొచ్చింది. దూకుడుగా ఆడిన ఆ జట్టు రెండు రోజుల పాటు పూర్తిగా బ్యాటింగ్ చేసి రికార్డ్ స్కోర్ అందుకుంది. దులీప్‌ట్రోఫీ ఫైనల్స్ చరిత్రలోనే ఇది రెండో అత్యధిక స్కోర్‌గా నిలిచింది. 1987 దులీప్ ట్రోఫీ ఫైనల్లో వెస్ట్ జోన్‌పై నార్త్ జోన్ 868 పరుగులు చేసింది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక స్కోర్‌గా కొనసాగుతోంది. తాజా ఫైనల్‌కు ముందు రెండు సార్లు మాత్రమే జట్లు 700 ప్లస్ స్కోర్లు చేశాయి. 1986లో సౌత్ జోన్.. 1991లో నార్త్ జోన్ 700 పరుగుల మార్క్‌ను అందుకున్నాయి. హాఫ్ సెంచరీకి చేరువైన అనుకూల్ రాయ్(45)ను షేక్ రషీద్ ఔట్ చేయగా.. షమీ, ఖురైషి సౌత్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించారు.




# ఫోన్ ఫ్రీజ్ అయిందా..?

### జాగ్రత్త పడాల్సిందే..

ఆకర్షించే, తెలియని ప్రకటన లింక్‌లపై క్లిక్ చేయగానే.. ఫోన్ పనిచేయడం ఆగిపోతే తేలిగ్గా తీసుకోవద్దని నిపుణులు చెప్తున్నారు. ఈ దోపిడీని స్కామర్లు పక్కా ప్లాన్‌తో చేస్తున్నారు. తొలుత సోషల్ మీడియా యాడ్స్, లింక్స్‌తో యూజర్‌ను టార్గెట్ చేస్తారు. ఒక్కసారి లింక్ తెరవగానే.. ఒక ఎర్రర్ మెసేజ్ వస్తుంది లేదా ఫోన్ స్క్రీన్ తాత్కాలికంగా పనిచేయకుండా నిలిచిపోతుంది. తర్వాత బ్యాంక్ ఉద్యోగి/టెక్నికల్ సపోర్ట్ సర్వీస్ లేదా సర్వీస్ ప్రొవైడర్ పేరిట ఆ యూజర్‌ను నేరగాళ్లు సంప్రదిస్తారు. నకిలీ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేయమని చెప్తారు. ఒకసారి ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేస్తే.. ఫోన్ కంట్రోల్ వారి చేతుల్లోకి వెళ్లిపోతుంది. మెసేజ్‌లు, నోటిఫికేషన్లు, కాల్స్‌ను యాక్సెస్ చేసుకోవడానికి ఆ యాప్స్ పర్మిషన్ అడుగుతుంటాయి. అనుమతి ఇచ్చే ముందు జాగ్రత్తగా పరిశీలించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక్కోసారి స్క్రీన్ షేరింగ్ యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని స్కామర్లు ఒప్పిస్తుంటారు కూడా. వాటికి ఓకే చెప్తే.. స్క్రీన్‌పై కనిపించే వివరాలను సైబర్ నేరగాళ్లు చూడటానికి వీలు కలుగుతుంది. అప్పుడు యూజర్ స్థానంలో ఫోన్‌ను కూడా వాడే అవకాశం కేటుగాళ్లకు లభిస్తుంది. అలాంటి సమయాల్లో బ్యాంకింగ్ సమాచారం వారి చేతిలో పడే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి ప్రయత్నాలతో యూపీఐ సెక్యూరిటీ వ్యవస్థలోకి చొరబడాల్సిన అవసరం లేకుండానే.. యూజర్ల వివరాలను వారు తెలుసుకోగలుగుతున్నారు.

### ఫోన్‌స్క్రీన్ ఫ్రీజ్ అయినప్పుడు ఏం చేయాలి..?

- ఫోన్‌లో ఎర్రర్ సందేశాలు రావడం, స్క్రీన్ ఫ్రీజ్ అయిన సందర్భాల్లో బ్యాంక్ వివరాలు ఎంటర్ చేయకుండా చూడాలి.
- వెంటనే మొబైల్, వైఫై డేటాను ఆఫ్ చేయాలి.
- తెలియని వ్యక్తులు చెప్పిన యాప్స్ డౌన్‌లోడ్ చేయొద్దు. స్క్రీన్ షేరింగ్‌ను ఇన్‌స్టాల్ చేయొద్దు.
- అలాగే గతంలో ఏవైనా అనుమానిత యాప్స్ డౌన్‌లోడ్ చేసి ఉంటే.. వాటికిచ్చిన అనవసర అనుమతులను ఎప్పటికప్పుడు తొలగించుకోవడం మంచిది.
- మీ బ్యాంకింగ్ సమాచారం నేరగాళ్ల చేతుల్లో పడిందని అనుమానిస్తే.. వెంటనే సంబంధిత బ్యాంకులను సంప్రదించాలి. ఇటీవల లావాదేవీలను పరిశీలించుకోవాలి.
- ఇన్ని చేసినా డబ్బు పోయి ఉంటే.. నేషనల్ సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ (1930)కి కాల్ చేయాలి.
- ఈ డిజిటల్ యుగంలో యూపీఐ పిన్, ఓటీపీని ఎవరికీ చెప్పకుండా జాగ్రత్తగా ఉంటే మాత్రమే సరిపోదు. మొబైల్ డివైజ్ సెక్యూరిటీ, యాప్స్‌కు ఇచ్చే అనుమతులు, అనుమానిత కాల్స్, లింక్స్‌పై యూజర్ల అప్రమత్తతా అంతే కీలకమని నిపుణులు సూచిస్తున్నారు.

# గ్రామీణ ప్రాంత ప్రజలకు ఊరట..

### వంటగ్యాస్ బుకింగ్ గడువు తగ్గింపు



వంటగ్యాస్ బుకింగ్ గడువు విషయంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. రీఫిల్ బుకింగ్ గడువును 45 రోజుల నుంచి 25 రోజులకు తగ్గించింది. ఈ మేరకు కేంద్రమంత్రి సురేశ్ గోపి సోమవారం వెల్లడించారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్‌లో ఇంధన రవాణాకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆ సమయంలో గ్యాస్ అందరికీ అందుబాటులో ఉండేలా చూసుకునేందుకు.. బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలను అరికట్టే లక్ష్యంతో కేంద్రం పట్టణ ప్రాంతాల్లో సిలిండర్ రీఫిల్ గడువును 25 రోజులుగా, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులుగా ఉంచింది. "ప్రస్తుతం ఎల్‌పీజీ సరఫరా మెరుగుపడటం, రీఫిల్ బకాయిలు తగ్గడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని, ఈ గడువు విషయంలో సడలింపులు చేసింది. ఇప్పుడు గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో సంబంధం లేకుండా ఎల్‌పీజీ గృహ వినియోగదారులంతా 25 రోజుల వ్యవధిలో రీఫిల్ బుక్ చేసుకోవచ్చు" అని మంత్రి వెల్లడించారు. ఈ మార్పు తక్షణమే అమల్లోకి వస్తుందని తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

జనం వార్త



# 'రణబాలి' టీజర్ అప్డేట్



టాలీవుడ్ మోస్ట్ పాపులర్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహబంధంలోకి అడుగుపెట్టిన తర్వాత తొలిసారి జంటగా నటిస్తున్న భారీ ప్రాజెక్ట్ 'రణబాలి'. 'ట్యాక్సీవాలా' ఫేమ్ రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా బిగ్గెస్ట్ పిరియాడిక్ డ్రామాను టి సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. హాలీవుడ్ లెజెండరీ యాక్టర్ ఆర్నాల్డ్ వోస్లూ ఈ చిత్రంలో ప్రధాన విలన్‌గా నటిస్తుండగా, మ్యూజిక్ డైరెక్టర్స్ అజయ్-అతుల్ అద్భుతమైన సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా 1854 నుండి 1878 మధ్య బ్రిటిష్ పరిపాలనా కాలంలో జరిగిన కొన్ని నమ్మశక్యం కాని వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతోంది. ఇందులో విజయ్ దేవరకొండ ఒక పవర్‌ఫుల్ యోధుడి పాత్రలో కనిపించబోతున్నారు. ప్రస్తుతం షూటింగ్ ముగింపు దశకు చేరుకున్న ఈ విజువల్ వండర్ దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అయితే నెల రోజుల్లో సినిమా విడుదల కానుండటంతో ప్రమోషన్ల విషయంలో స్పీడ్ పెంచిన చిత్రబృందం, తాజాగా నెట్టింట ఒక బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. సెప్టెంబర్ 9న 'రణబాలి' టీజర్‌ను విడుదల చేయబోతున్నట్లు ప్రకటిస్తూ.. ఒక పవర్‌ఫుల్ ప్రోమో వీడియోను వదిలింది. "శాపగ్రస్త భూమికి సంబంధించిన రహస్య పురాణగాథ ఉద్భవిస్తోంది" అని ఇంట్రెస్టింగ్ క్యాప్షన్ జత చేయడంతో విజయ్-రష్మిక అభిమానుల్లో ఈ టీజర్‌పై విపరీతమైన ఆసక్తి, నెలకొంది.

## ప్రొడక్షన్-39లో శ్రీవిష్ణుకు జోడీగా ఆషికా రంగనాథ్..?

నా సామిరంగ, అమిగోస్ సినిమాలతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న కన్నడ భామ ఆషికా రంగనాథ్ టాలీవుడ్‌లో తిరుగులేని క్రేజ్‌తో దూసుకెళ్తోంది. తన గ్లామర్‌తో పాటు అభినయంతో కూడా ఆకట్టుకునే ఈ భామ, త్వరలో 'సర్దార్ 2' మూవీతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. సౌత్‌లో మంచి డిమాండ్ ఉన్న హీరోయిన్‌గా మారిన ఆషికా తాజాగా, మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌లో చాన్స్ దక్కించుకున్నట్లు నెట్టింట పలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. వైవిధ్యమైన కథలతో సందడి చేసే యంగ్ హీరో శ్రీవిష్ణుకు జోడీగా ఆషికా నటించనున్నట్లు టాక్. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న 'ప్రొడక్షన్ నంబర్ 39' చిత్రంలో ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా ఎంపికైనట్లు తెలుస్తోంది. 'అనగనగా' ఫేమ్ సన్నీ సంజయ్ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే ప్రారంభం కాగా.. శరవేగంగా జరుగుతోంది. ఈ మూవీ, నేటి తరం యంగ్‌స్టర్స్ లైఫ్‌లోని కాంప్లికేషన్స్, రిలేషన్‌షిప్ ఎమోషన్స్ చుట్టూ తిరగనుంది. రీసెంట్‌గా రిలీజైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో ఆషికా ఎంట్రీ ఇవ్వడంతో ఈ మూవీపై హైప్ క్రియేట్ అయింది. కాగా.. ఆషికా రంగనాథ్ కెరీర్ విషయానికొస్తే.. 'విశ్వంభర' వంటి భారీ పాన్-ఇండియా సినిమాతో పాటు కన్నడ, తమిళ, తెలుగు ఇండస్ట్రీల్లో వరుస చాన్స్‌లు అందుకుంటూ ఆషికా దూసుకెళ్తోంది.

## చరిత్ర తిరగరాసిన స్పైడర్‌మ్యాన్..
# భారత్‌లో రూ.500 కోట్లు




హాలీవుడ్ చిత్రాలు భారత్‌లో వసూళ్ల వర్షం కురిపించడం కొత్తేం కాదు. ముఖ్యంగా 'అవెంజర్స్', 'అవతార్', 'స్పైడర్‌మ్యాన్' ఫ్రాంఛైజీ చిత్రాలతో పాటు, దర్శకుడు క్రిస్టఫర్ నోలన్ సినిమాలకూ మన దేశంలో పెద్ద సంఖ్యలో అభిమానులున్నారు. అందుకే ఇక్కడి స్టార్ల సినిమాలతో పోటీపడేలా వాటికి భారీ మొత్తంలో వసూళ్లు వస్తుంటాయి. అయితే ఇప్పటివరకూ ఏ హాలీవుడ్ చిత్రానికీ సాధ్యం కాని రీతిలో ఇండియన్ బాక్సాఫీసు వద్ద ప్రభంజనం సృష్టించింది 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే'. ఏకంగా రూ.500 కోట్లు కలెక్ట్ చేసి సత్తా చాటింది. భారత్‌లో ఈ మైలురాయిని అందుకున్న తొలి హాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగమైన స్పైడర్‌మ్యాన్ పాత్రతో తెరకెక్కిన ఈ సినిమా జులై 30న భారీ అంచనాలతో విడుదలైంది. తొలిరోజు నుంచే కళ్లుచెదిరే వసూళ్లతో అదరగొట్టింది. తొలి వారంలోనే రూ.330 కోట్లకు పైగా వసూలు చేసింది. 39 రోజుల్లోనే రూ.500 కోట్ల మార్కును అధిగమించడం విశేషం. స్పైడర్‌మ్యాన్ పాత్రలో మరోసారి టామ్ హోలండ్ నటించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్త వసూళ్లలోనూ తిరుగులేని ఆధిక్యం ప్రదర్శిస్తోంది. ఇప్పటివరకూ రూ.22,600 కోట్లకు పైగా వసూలు చేసినట్లు హాలీవుడ్ విశ్లేషకులు చెబుతున్నారు.

# 'వారణాసి'పై అంచనాలు పెంచుతున్న రాజమౌళి కామెంట్స్



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'. గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా, మలయాళ వర్సటైల్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ భారీ అడ్వెంచరస్ ఫిల్మ్‌కు ఆస్కార్ విన్నర్ ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ ప్రాజెక్ట్‌పై రోజూ ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో విపరీతంగా హల్ చల్ చేస్తూనే ఉంటుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రాజమౌళి, ఈ సినిమా రేంజ్ ఏ స్థాయిలో ఉండబోతోందో చెప్పి మైండ్ బ్లాక్ చేశారు. "నా కెరీర్‌లోనే 'వారణాసి' అత్యంత భారీ, ప్రతిష్టాత్మకమైన చిత్రం. నాకు సాహసాలు, అడ్వెంచర్ కాన్సెప్ట్స్ అంటే ఎంతో ఇష్టం. ఆ ఉద్దేశంతోనే ఈ కథను ప్రారంభించాం. కానీ ప్రాసెస్ మొదలయ్యాక దీని స్కేల్ ఊహించని విధంగా పెరిగిపోతూ వచ్చింది" అని ఆయన చెప్పుకొచ్చారు. ఇక ఈ సినిమా బ్యాక్‌డ్రాప్ గురించి మాట్లాడుతూ.. "ఈ కథ ప్రేక్షకులను అంటార్కిటికా మంచు కొండల నుంచి ఆఫ్రికా అడవుల వరకు తీసుకెళ్తుంది. అంతటితో ఆగకుండా త్రేతాయుగంలో శ్రీరాముడి కాలానికి కూడా కథ ప్రయాణిస్తుంది. అక్కడ భారీ దైవిక రూపాలను, సరికొత్త లోకాన్ని చూస్తారు. అయితే ఈ విజువల్ వండర్స్, ట్రావెల్ వెనుక ఒక తండ్రి, కొడుకు మధ్య ఉండే అత్యంత బలమైన ఎమోషనల్ బాండింగ్ ఉంటుంది. అదే ఈ సినిమాకు అసలైన మూలం" అని రాజమౌళి పేర్కొన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి.



## ప్రాధాన్యత లేని పాత్రలు ఇచ్చి బ్లేమ్ చేయడం సరికాదు
### ప్రియా భవానీ శంకర్ సెన్సేషనల్ కామెంట్స్

'ఇరుముడి'సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ప్రియా భవానీ శంకర్ వరుస అవకాశాలు దక్కించుకుంటూ ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. త్వరలోనే 'డెమోంటే కాలనీ-3' చిత్రంతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియా.. డైరెక్ట్ తమిళ సినిమాల్లో నటీమణులకు ఇచ్చే పాత్రల గురించి చేసిన వ్యాఖ్యలు నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. గడిచిన ఐదేళ్లలో వచ్చిన పెద్ద తమిళ సినిమాల్లో కేవలం రెండే రెండు గుర్తుండిపోయే మహిళా పాత్రలు ఉన్నాయని ఆమె చెప్పారు. తమిళ చిత్రాల్లో హీరోయిన్ల ప్రాధాన్యత తగ్గడం బాధాకరమని అన్నారు. అలా అని మంచి అవకాశాలు వస్తాయని ఇంట్లోనే ఖాళీగా కూర్చుని ఎదురుచూడలేమని, అందుకే ఉన్న అవకాశాలనే సరిపెట్టుకుంటూ ముందుకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. తనకు ఇండస్ట్రీలో ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకపోవడం వల్ల అవకాశాలు రావడం మరింత కష్టంగా మారిందని ప్రియా వెల్లడించారు. తన కోసం ఒక సినిమాను లైన్లో పెట్టే కాంటాక్ట్స్ గానీ, మనుషులు గానీ తనకు లేరని అన్నారు. కనీసం డైరెక్టర్ ప్రభు గారికి ఫోన్ చేసి తన దగ్గర ఉన్న లేడీ ఓరియంటెడ్ కథను వినమని చెప్పేంత అవకాశం కూడా తనకు లేదని వివరించారు. ప్రస్తుతం నయనతార లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేస్తోందంటే అది అంత తేలికైన విషయం కాదని చెప్పారు. దాదాపు 15 ఏళ్లకు పైగా హీరోయిన్‌గా ఉంటూ, ఎన్నో వివాదాలను తట్టుకుని నిలబడటానికి ఆమె ఎంతో ధైర్యం చూపించిందని ప్రశంసించారు. ఒకప్పుడు హీరోయిన్ ప్రాధాన్యత ఉన్న కథలు బాగా వచ్చేవని, కానీ ఇప్పుడు అలాంటి సినిమాలు చేయడం తగ్గించారని అన్నారు. పెద్ద సినిమాల్లో ప్రాధాన్యత లేని పాత్రలు ఉన్నప్పుడు దానికి హీరోయిన్లను బాధ్యులను చేయడం సరికాదని ప్రియా భవానీ శంకర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083. EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com